**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001.

ఫోన్ నెం: 9885826108. E-mail: shanthimama@gmail.com


# ధర్మఘంట

తెలుగు దినపత్రిక


సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో

ప్రజల కోసం ప్రకృతి కోసం

DHAMMA Spoorthi TV

సామాన్యుడి గొంతుకై త్వరలో వస్తుంది



సంపుటి : 12 సంచిక :62 నల్గొండ బుధవారం 21-05-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంపై కమిటీ ఏర్పాటు



హైదరాబాద్ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో గుల్జార్ హౌజ్ వద్ద ఈ నెల 18న జరిగిన అగ్ని ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు, ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ నిర్ణయం నేపథ్యంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ప్రభుత్వ చర్యలపై స్పష్టతనిచ్చారు. ఈ విచారణ కమిటీకి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, సీపీ సీవీ ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విద్యుత్ పంపిణీ సంస్థ TSSPDCL సిఎండి ముషారఫ్ వంటి కీలక పదవులలో ఉన్న అధికారులను నియమించారు. ఈ కమిటీ బాధ్యత, గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం జరిగిన కారణాలు, ఘటన అనంతరం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయడం.కేవలం కారణాలపై నివేదిక తయారు చేయడమే కాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు చేయాలి వంటి విషయాలపై కమిటీ స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించనుంది. ఘటనపై నివేదిక అందిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటారని మంత్రి పొన్నం వెల్లడించారు. ప్రజల ప్రాణాలు విలువైనవని, భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలపై సున్నితంగా స్పందించడమే కాకుండా, తక్షణమే పరిష్కార మార్గాలు అన్వేషించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కమిటీ ఏర్పాటు ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## ఘోర కుట్ర వెలుగులోకి.. నాలుగు రాష్ట్రాల్ని వణికించేందుకు పేలుళ్ల ప్లాన్

న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా శాంతి భద్రతలకు పతనం కలిగించేందుకు కుట్రలు నడుస్తున్న దృశ్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పేలుళ్ల కోసం వ్యూహాత్మకంగా సిద్ధమవుతున్న గ్రూపును భద్రతా సంస్థలు పట్టు పట్టాయి.ఇందులో ఆరుగురు సభ్యులతో కూడిన తీవ్రవాద సంస్థ "అల్-హింద్ ఇత్తేహదుల్ ముసల్మాన్" కీలక పాత్ర పోషిస్తోంది.విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ జీవితం ఒక సాధారణ యువకుడి ప్రయాణంలా మొదలైంది. 2017లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, ఎస్ఐ, గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమవుతూ హైదరాబాదులో శిక్షణ తీసుకున్నాడు. కానీ ఎస్ఐ సెలక్షన్‌లో విఫలం కావడం, గ్రూప్-1లో స్థిరపడలేకపోవడం అతని మనస్తత్వాన్ని మార్చేసినట్లు అనిపిస్తోంది. ఆ మధ్యకాలంలో 108 అంబులెన్స్ సర్వీసులో టెలికాలర్‌గా పని చేస్తూ బోయగూడకు చెందిన సయ్యద్ సమీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది – అదే అతని జీవితాన్ని ఎడారిలోకి నెట్టిన మొదటి అడుగు అయ్యింది.సమీర్ ద్వారా వరంగల్‌కు చెందిన పరహాన్ మొయిన్, యూపీకి చెందిన బాదర్ వంటి మిగతా తీవ్రవాదులతో పరిచయమయ్యాడు. సమాజంలో ముస్లింలపై జరుగుతున్న అన్యాయాల పేరుతో చర్చలు, ఆగ్రహం, చివరికి తీవ్రవాద మార్గం వైపు మలుపు తీసుకున్న ఈ గ్రూపు ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో గోప్యంగా సమావేశాలు నిర్వహించాయి.ఒమన్‌లోని హైదరాబాదు వాసి ఇమ్రాన్ అక్రమ్ మార్గదర్శకత్వంలో పేలుడు పదార్థాల కొనుగోలు, వాటిని ఉపయోగించి IED



బాంబులు తయారు చేయడం మొదలైంది. ఈ బాంబులను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పేల్చాలని, ముందు "డమ్మీ బ్లాస్ట్" నిర్వహించాలని కూడా ప్రణాళిక రూపొందించారు.ఈ కుట్రకు సాంకేతిక ప్లాట్‌ఫార్ములు కూడా నిలయాలుగా మారాయి. సిగ్నల్ వంటి షాడో కమ్యూనికేషన్ యాప్‌లలో తరచూ మాట్లాడుతూ, అబూ ముసబ్ అనే విదేశీ మూడ్‌గాడ్ సూచనలతో ముందుకెళ్లారు. "జిహాదీ చర్యల్లో భాగంగా అవసరమైతే ప్రాణత్యాగం చేయాలన్న" నిబద్ధతకు సిరాజ్, సమీర్ అంగీకరించారు. ఈ ఘోర కుట్ర వ్యూహం గట్టిగానే మెలిగింది కానీ, కేంద్ర బలగాల , రాష్ట్ర పోలీసుల నిఘాకు చివరికి లొంగిపోయింది. వీరి పక్కా కమ్యూనికేషన్, విదేశీ నిధుల ప్రవాహం, IED తయారీ సామర్థ్యం అన్నీ కలిపి ఒక దేశవిద్రోహ కుట్రగా వెలుగులోకి వచ్చింది.

## మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా రాజీనామా చేస్తారా..?

న్యూఢిల్లీ, భారతీయ మహిళా సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీ పై మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నాయకుడు కున్వర్ విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో మంత్రిపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇంత వివాదం చెలరేగినప్పటికీ ఆయన్ని మంత్రి పదవి నుంచి బీజేపీ ప్రభుత్వం తొలగించలేదు.ఈ విషయంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకు ఆయన్ని పదవి నుంచి తొలగించలేదంటూ ప్రశ్నిస్తున్నాయి. మంత్రి పదవికి విజయ్ షా రాజీనామా చేస్తారా..? లేదా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ షా రాజకీయ భవిష్యత్తుపై మే 28 తర్వాత ఏదైనా నిర్ణయం ఉంటుందని బీజేపీ వర్గాలు తాజాగా వెల్లడించాయి. విజయ్ షా వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ బృందం మే 28న సుప్రీం కోర్టుకు నివేదికను సమర్పిస్తుంది. సిట్ నివేదిక సమర్పించిన తర్వాతే ఆయన రాజీనామాపై నిర్ణయం వెలువడుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు.'కోర్టు జారీ చేసే ఏ ఆదేశానికైనా కట్టుబడి ఉంటామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. మే 28న సిట్ తన నివేదికను సమర్పించిన తర్వాత విజయ్ షాకు సంబంధించి ఏదైనా నిర్ణయం ఉంటుంది' అని బీజేపీ వర్గాలు తెలిపాయి. మరోవైపు సీఎం మోహన్ యాదవ్ ఇవాళ ఇండోర్‌లో కేబినెట్ భేటీ నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి షా హాజరుకాకపోవచ్చని తెలిసింది. తాజాగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి పార్టీ హైకమాండ్‌తో మాట్లాడేందుకు షా ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి.

### మీ క్షమాపణ మొసలి కన్నీరులా కనపడుతున్నది



మిమ్మల్ని చూసి యావద్దేశం సిగ్గుపడుతోందంటూ దేశ అత్యున్నత ధర్మాసనం విజయ్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. చేసిన చెత్త వ్యాఖ్యలకు విజయ్ షా చెప్పిన క్షమాపణను తిరస్కరిస్తున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. 'ఎటువంటి ఆలోచన లేకుండా చేసిన మీ చెత్త వ్యాఖ్యలకు మీరు ఇచ్చిన క్షమాపణ మాకు అవసరం లేదంటూ' అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.స్వయం కృతాపరాధం వల్ల ఏర్పడిన పరిస్థితి నుంచి బయటపడేందుకే విజయ్ షా మొసలి కన్నీళ్లు కారుస్తున్నట్లు తమకు అనుమానంగా ఉందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ఉదంతాన్ని దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి వివరాలను వివరించేందుకు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలసి కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ విలేకరుల సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. మరోవైపు వివాదాస్పద వ్యాఖ్యలకు గానూ విజయ్ షాపై కేసు కూడా నమోదైంది.

## మహారాష్ట్రలో కోరలు చాస్తున్న కరోనా..



న్యూఢిల్లీ, నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి (Corona Virus) ఇప్పుడు మళ్లీ విజృంభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ (Covid-19) కేసులు పెరుగుతున్నాయి. సింగపూర్, హాంకాంగ్, చైనా, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఇక భారత్‌లోనూ 257 యాక్టివ్ కేసులు ఉన్నాయి. అయినప్పటికీ దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.కాగా, మహారాష్ట్రలో కరోనా వైరస్ యాక్టివ్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే పాజిటివ్ కేసుల సంఖ్య 12 నుంచి 56కి పెరిగింది. అంతేకాదు మరణాలు కూడా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ నివారణ చర్యలు తీసుకుంటున్నారు. ఇక దేశంలో అత్యధికంగా కేరళలో 95 కొవిడ్ పాజిటివ్ కేసులు ఉన్నాయి.

### దేశంలో 257 కొవిడ్ కేసులు

సింగపూర్, హాంకాంగ్‌లలో కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) సమీక్షా సమావేశం నిర్వహించింది. మన దేశంలో ప్రస్తుతం 257 కొవిడ్ కేసులు నమోదైనట్లు తెలిపింది. ఇవి స్వల్ప లక్షణాలు గల కేసులని, వ్యాధిగ్రస్థులను దవాఖానలలో చేర్పించి, చికిత్స చేయవలసిన అవసరం లేదని వివరించింది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, సెంట్రల్ గవర్నమెంట్ హాస్పిటల్స్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసం?



హైదరాబాద్: మినీ అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీలుగా గుర్తించి పూర్తి జీతం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. అంగన్వాడీలుగా గుర్తించి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇప్పటికీ పెరిగిన జీతం ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన జీవోను కాపీ కొట్టి రేవంత్ సర్కార్ ప్రచారం చేసుకున్నదని మండిపడ్డారు. మూడు నెలలు మాత్రమే పెంచిన జీతం ఇచ్చి గతేడాది కాలంగా వారిని పాత జీతానికే పని చేపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీతాన్ని రూ.13,650 నుంచి తిరిగి రూ.7,800కి తగ్గించడం దారుణమని, బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమోనని ఎద్దేవా చేశారు. అన్నిట్లో తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళల కడుపు కొడుతున్నాదని మండిపడ్డారు. మే నెల జీతాన్ని 8 జిల్లాల్లో మాత్రమే ఇచ్చి మిగతా జిల్లాల వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మినీ అంగన్వాడీలు ప్రచార సాధనాలు కాదని, వారికి నిజమైన గౌరవం ఇవ్వాలన్నారు. జనవరి 2024 నుంచి 12 నెలలకు పెరిగిన జీతాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీ కేంద్రాలుగా మారిన ప్రతీ చోట హెల్పర్లను నియమించాలన్నారు. మే నెల పెరిగిన జీతాలు అందని జిల్లాల్లో తక్షణమే చెల్లించాలన్నారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

### లేఖలో ఏముందంటే..

'తెలంగాణ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న మానసిక వేదన, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మీ దృష్టికి తీసుకురాదలిచాను. రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలున్నారు .వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అత్యంత పేదవర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తల కష్టాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఉత్తర్వులు అమలు కాలేదు .కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీతక్క.. మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేసిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. 2023 డిసెంబర్ 15న ఇదే విషయంపై జీవో కూడా జారీ చేశారు. కానీ, అది గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో. దాన్నే తిరిగి కొత్తగా ప్రచారం కోసం విడుదల చేసి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు.2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలలు అంగన్వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మినీ అంగన్వాడీ జీతం రూ.7,800కి తగ్గించి, 2025 ఏప్రిల్ వరకు అదే జీతం చెల్లించింది. ఈ విధంగా, మూడు నెలలు అంగన్వాడీలుగా గుర్తించి, తిరిగి సంవత్సర కాలం మినీ అంగన్వాడీ జీతాలతో పనిచేయించడంతో వీరి కుటుంబాలకు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేసింది. బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమో! అన్నిట్లో తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసం?.మినీ అంగన్వాడీలు తమ హక్కుల కోసం మంత్రి గారిని, అధికారులను అనేకసార్లు కలిసినా, ప్రభుత్వం స్పందించలేదు. బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంపై ప్రశ్నించిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మళ్లీ పాత జీవోను తిరిగి విడుదల చేస్తూ, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తున్నామని ప్రచారం చేసుకున్నారు.అయినప్పటికీ, మే నెలలో కేవలం ఎనిమిది జిల్లాల్లోని మినీ అంగన్వాడీలకు మాత్రమే అంగన్వాడీ పే గ్రేడ్ జీతాలు చెల్లించి, మిగతా జిల్లాల వారికి జీతాలు చెల్లించలేదు. ఈ అస్పష్టత, అయోమయం వీరిని మరింత గందరగోళంలోకి నెట్టింది. ఒకే పనికి రెండు సార్లు జీవోలు జారీ చేసి, రాజకీయ ప్రచారం చేసుకోవడం తప్ప, మినీ అంగన్వాడీలకు ఎలాంటి న్యాయం జరగలేదు.


## అమెరికాలో బీఆర్ఎస్ రజతోత్సవం.. సిద్ధమవుతోన్న డల్లాస్ వేదిక

డల్లాస్: బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకొని, జూన్ 1, 2025 న అమెరికాలోని డల్లాస్ న్యూస్ డీఆర్ పెప్పర్ ఎరినా వేదికగా బీఆర్ఎస్ రాష్ట్రోత్సవ వేడుకలు(బీఆర్ఎస్ డల్లాస్ ఈవెంట్) ఘనంగా నిర్వహించబోతున్నట్లు బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ శ్రీ మహేష్ బిగాల తెలిపారు.ఈ సందర్భంగా డల్లాస్ నగరాన్ని సందర్శించిన బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ శ్రీ తన్నీరు మహేష్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, అభిమానులతో సమావేశమై, రాబోయే కార్యక్రమాల %ణ=% పెప్పర్ ఏరిన సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరుకానున్నట్టు మహేష్ బిగాల తెలిపారు.డల్లాస్ భేటీ ఓ వేడుకే కాకుండా, తెలంగాణ ఉద్యమ ఆత్మను ప్రపంచానికి వినిపించే గొప్ప వేదికగా మారను. రజతోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆట పాటలతో కళాకారుల ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ మహాసభకు యూఎస్ఏలోని తెలంగాణ , తెలుగు ప్రజలు, బీఆర్ఎస్ మద్దతుదారులు, ఇతర తెలంగాణ సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. అన్ని సంఘాలు మద్దతు తెలిపాయి.బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ శ్రీ తన్నీరు మహేష్ మాట్లాడుతూ అమెరికాలోని వివిధ



రాష్ట్రాల బీఆర్ఎస్ మద్దతుదారులు, అనుబంధం సంఘాలు ఈ మేరకు సమన్వయపూర్వకంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ వేడుక అమెరికా చరిత్రలో మైలురాయిగా నిలిచే వేడుక అవుతుందని తెలిపారు.ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రాజతోత్సవ సభ తరహాలోనే, డల్లాస్‌లోని ఈ వేడుక కూడా చరిత్రలో నిలిచిపోయేలా చేయడం లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమెరికాలోని బీఆర్ఎస్‌రీ, శ్రీనివాస్ శురభి, హరీష్ రెడ్డి, శ్రీనివాస్ సురకంటి మిగితా సభ్యులు కూడా సభా వేదిక పర్యా'వేక్షణ'లో ఉన్నారు.

## మారని పాక్ పీఎం.. భారత్ ఐఎస్ఎస్ విక్రాంత్ ని ధ్వంసం చేశామంటూ గొప్పలు..!



ఇస్లామాబాద్: పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకుంది భారత్. కానీ, పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ అసత్య ప్రచారంతో అక్కడ ప్రజలను మభ్య పెడుతున్నారు.ఇండియాపై విజయం సాధించామంటూ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా కరాచీలో పర్యటించిన సందర్భంగా అతడు మాట్లాడుతూ.. పాకిస్తాన్ నావికాదళం, వైమానిక దళాన్ని ప్రశంసిస్తూ ఇలా అన్నారు.. ఇండియన్ నౌవీకి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్ పాకిస్తాన్‌కు దగ్గరగా వచ్చింది.. మన దేశానికి కేవలం 400 నాటికల్ మైళ్ల దూరంలో ఉంది.. కానీ, విక్రాంత్ పై పాకిస్తాన్ వైమానిక దళం దాడి చేసి తీవ్రంగా నష్టం కలిగించిందని అబద్దపు మాటలు చెప్పుకొచ్చారు షెహబాజ్ షరీఫ్.అయితే, పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ కి చెందిన క్షిపణులు దాడి చేసి వాటిని పూర్తిగా ధ్వంసం చేశాయి. అలాగే, సుమారు 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చినట్లు భారత సైన్యం ప్రకటించింది. మరోవైపు, పాక్ మాత్రం ప్రజల నివాస ప్రాంతాల పైనే డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కానీ, వాటిని ఇడియన్ ఆర్మీ తిప్పికొట్టింది. ఈ సందర్భంగా పాకిస్తాన్ కు చెందిన ఐదు ఎయిర్ బేస్ క్యాంపులపై దాడి చేయడంతో.. దెబ్బకు పాకిస్తాన్ దిగొచ్చింది. దీంతో భారత్ తో కాల్పుల విరమణ చేసుకుంది పాకిస్తాన్.

## సంపాదకీయం

బుధవారం 21-05-2025

# చీకటి వెలుగులు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి. మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు. భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీధిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. ‘మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును’ అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం. ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం (శ్రుతిమించి) మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలు నెలకొల్పారు. ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్దిక్ గ్రామంలో ఉంది. ‘ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా’ అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞానధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది బహుభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లాయైట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు నాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో చాలా మార్పులు జరిగాయి. జాన్ గుటెన్‌బర్గ్ రూపొందించిన ముద్రణ యంత్రం పుస్తకాల రూపురేఖలను మార్చేసింది. ఆధునిక పుస్తకాలకు అంకురార్పణ చేసింది. పారిశ్రామిక విప్లవ కాలంలో పుస్తకాల ముద్రణ పెరగడం మొదలైంది. వలస పాలనలు మొదలవడంతో ప్రజలకు బహుభాషా పరిచయం ఏర్పడి, సమాచార ఆదాన ప్రదానాలు ఊపందుకున్నాయి. బ్రిటిష్ హయాంలో మన దేశంలో నాటి కలకత్తా నగరంలో ‘ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ’ పేరుతో తొలి ఆధునిక గ్రంథాలయం 1781లో ఏర్పడింది. అప్పటికి సతీసహగమన దురాచారంపై ఇంకా నిషేధం విధించలేదు. మన తెలుగునేల మీద 1886లో తొలి ఆధునిక గ్రంథా లయాన్ని విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణమూర్తి నెలకొల్పారు. అప్పటికి కన్యాశుల్కం దురాచారం తీవ్రంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అయ్యంకి వెంకటరమణయ్య నేతృత్వంలో గ్రంథాలయోద్యమం కూడా మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతిక సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసరగోడ్ జిల్లా కంబలూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. ‘జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును’ అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

# అమరావతిలో గలీజు పని...



అమరావతి,అమరావతిలోని సీఆర్‌డీఏ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓ కీలక గనులశాఖ అధికారి తన తోడల్లుడికి మైనింగ్ లీజు ఇప్పించేందుకు ప్రయత్నించాడు. ఉన్నతాధికారి బ్రేక్ వేయడంతో వ్యవహారం సీఎంఓ దాకా వెళ్లి, సంబంధిత అధికారికి షోకాజ్ జారీ చేశారు.గనుల శాఖలోని ఓ కీలక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా తన తోడల్లుడికి అమరావతిలో మైనింగ్ లీజు ఇప్పించాలని ప్రయత్నించారు. ఈ ప్రతిపాదనకు ఓ ఉన్నతాధికారి బ్రేక్ వేయడంతో విషయం ముఖ్యమంత్రి కార్యాలయం దాకా వెళ్లింది. ప్రతిపాదన పంపిన అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాజధాని నిర్మాణం కోసం గుంటూరు జిల్లాలో రోడ్ మెటల్, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మైనింగ్ లీజులను అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకు ఇచ్చేలా, వాటికి మాత్రమే మెటీరియల్ పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అమరావతి పనుల్లో వేగం పెరిగాక రోడ్ మెటల్, గ్రావెల్ కొరత రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయం తెలిసి కూడా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి మైనింగ్ లీజు ఇప్పించాలని చూశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ అధికారితో ఈ మేరకు ప్రతిపాదన పంపించారు. ఇది చూసి గనుల శాఖ ఉన్నతాధికారి కంగుతిన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. లీజు ప్రతిపాదన వ్యవహారంలో కీలక వ్యక్తి వద్ద మొన్నటి వరకు పనిచేసిన ఓ రిటైర్డ్ అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘించి..

అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వర్క్‌ల కోసం భారీగా రోడ్ మెటల్, గ్రావెల్ అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో అమరావతి పరిధిలో మైనింగ్ లీజులు, ప్రత్యేకించి రోడ్ మెటల్, గ్రావెల్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో, ప్రత్యేకంగా సీఆర్‌డీఏ జోన్‌లో అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకే లీజులు లేదా సరఫరా కాంట్రాక్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అది కూడా నామినేషన్ ప్రాతిపదికన ఇవ్వాలని ఆదేశించింది. దీని ప్రకారం అమరావతి నిర్మాణ పనులు చేయని కంపెనీలకు, వ్యక్తులకు మైనింగ్ లీజులు, సబ్ లీజులు ఇవ్వడానికి వీల్లేదు. అయినా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి అమరావతిలో సివిల్ వర్క్‌లు ఇప్పించాలనుకున్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలోని రోడ్‌మెటల్, గ్రావెల్ లీజులను తోడల్లుడికి చెందిన కంపెనీకి ఇవ్వాలని గుంటూరు గనుల అధికారి వద్ద దరఖాస్తు ఇప్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ కంపెనీకి నామినేటెడ్ ప్రాతిపదికన లీజులు ఇచ్చే అవకాశమే లేదు. కనీసం ఆ కంపెనీ దరఖాస్తును కూడా స్వీకరించకూడదు. కానీ గనుల అధికారి అవేవీ పాటించలేదు. దరఖాస్తును పరిగణనలోకి తీసుకొని, ఆ కంపెనీకే 22-1లోని లీజులు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అయితే ఆ కంపెనీ అమరావతి పరిధిలో ఏ వర్క్‌లు చేస్తుందో పొందుపరచలేదు. ఈ ప్రతిపాదనపై అనుమానం వచ్చి గనుల ఉన్నతాధికారి సమగ్ర విచారణ చేశారు. సంబంధిత అధికారిని పిలిచి మాట్లాడినట్లు తెలిసింది.

# కల్వకుంట్ల కవిత.. మరో వైఎస్ షర్మిల అవుతారా?

హైదరాబాద్,కుటుంబ పార్టీల్లో ఆప్యాయంగా పలకరించుకున్న అప్పులే శత్రులవుతారు! వారి మధ్య ఆమడదూరం పెరుగుతుంది! కుటుంబ పార్టీపై పెత్తనంలో భాగస్వామ్యం కోరుకోవడంతో మొదలయ్యే ఈ ఆధిపత్యపోరు.. ఆఖరుకు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే స్థితికి చేరుకుంటుందనేందుకు దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీల్లో ఉదాహరణలు ఉన్నాయి. పొరుగున తోటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇది చూసిందే! ఇప్పుడు తెలంగాణ వంతు వస్తుందా? కల్వకుంట్ల కుటుంబ సభ్యురాలిగా.. బీఆరెస్ ముగ్గురు ముఖ్యనేతల్లో ఒకరిగా ఉన్న కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత షర్మిల అడుగుజాడల్లో నడుస్తారా? ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదొక ఆసక్తికర అంశంగా రాజకీయ చర్చల్లో చోటుచేసుకుంటున్నది.ఆంధ్రప్రదేశ్‌లో తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో ఆయన అధికారంలోనే ఉన్న సమయంలో విభేదించిన షర్మిల.. సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆస్తి తగాదాలతోపాటు.. అధికారంలో భాగస్వామ్యం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో అన్నతో వేరుపడ్డారు. తర్వాతి కాలంలో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనంచేసి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా ఆ పార్టీకి రాష్ట్ర చీఫ్‌గా ఎదిగారు. గత ఎన్నికల్లో అటు తన అన్నకు చెందిన వైసీపీతోపాటు.. నాటి ప్రతిపక్షం టీడీపీపై పోరాటం చేశారు. ఇప్పటికి ఇంత జరుగకున్నా.. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె అడుగులు.. ఆమె షర్మిల బాటలోనే పయనిస్తారా? అనే సందేహాలకు తావిస్తున్నాయి. ఇక్కడా అధికారంలో భాగస్వామ్యం ఒక ఎత్తయితే.. అస్తిత్వం అనేది మరో అంశంగా ఉన్నది. బీఆరెస్ పార్టీకి తెలంగాణ జాగృతి కూడా ఒక అనుబంధ సంస్థ. కానీ.. ఒక పార్టీకి ఉండేలా తెలంగాణ జాగృతికి కూడా కమిటీలను, కన్వీనర్లను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపింది. పార్టీలో తనను దూరం పెడుతున్నారన్న వార్తల నేపథ్యంలో అధికారం, అస్తిత్వం కోసం కవిత తన సోదరుడు కేటీఆర్‌తో విభేదించారా? తండ్రి కేసీఆర్‌ను కాదని సమరానికి సై? అన్నారా? అనే చర్చలు సాగుతున్నాయి. ఒక సంస్థగా జాగృతిని బలోపేతం చేయడం వేరు.. దానికి కొన్ని శాఖలను పెట్టుకుని విస్తరించే ప్రయత్నం చేయడం వేరని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

తీహార్ జైలు నుంచి వచ్చాక కొంత మౌనం!

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో రిమాండ్ ఖైదీగా తీహార్ జైలులో ఐదు నెలల పాటు కవిత ఉన్నారు. గతేడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేయడంతో హైదరాబాద్ చేరుకున్న ఆమె.. కొద్ది నెలలు మౌనం దాల్చారు. బంజారాహిల్స్‌లోని తన ఇంటితో పాటు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఐదు నెలలపాటు జైల్లో ఉన్నందుకేమో.. ఆరోగ్యం దెబ్బతినడంతో మరింత ఆందోళనకు గురయ్యారని, రాజకీయంగా తన పరిస్థితిపై ఆలోచనలు చేస్తూ తీవ్ర మథనానికి గురయ్యారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. తనకు సన్నిహితంగా ఉన్న కొందరితో చర్చలు కూడా జరిపిన తరువాత ప్రజాక్షేత్రంలోనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. గతేడాది డిసెంబర్ నెలలో నిజామాబాద్ జిల్లాలో పర్యటనలతో కవిత యాక్టివేట్ అయ్యారు. రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టారు. దారి పొడవునా తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తూ.. కార్యకర్తలతో మాట్లాడుతూ మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చారు. పనిలోపనిగా డిసెంబర్ 4వ తేదీ నుంచి జిల్లాలవారీగా జాగృతి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నారు. రాజకీయ కార్యక్రమాలతో పాటు ఆత్మీయ సమ్మేళనాలు, ముఖ్య కార్యకర్తల కుటుంబాలకు పరామర్శలు చేస్తున్నారు. ఒక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి స్థాయిలో ఎక్కడా తగ్గకుండా మీడియా సమావేశాలు నిర్వహించి, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలన ఎలా ఉండేదని ప్రజలను అడిగి తెలుసుకునేవారు. అయితే ఈమె చేస్తున్న పర్యటనలు పార్టీకి మేలు చేస్తున్నాయో కీడు చేస్తున్నాయో అర్థం కాక సీనియర్లు తలలు పట్టుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక వాదంతో రేవంత్ రెడ్డి సర్కారును ఇరుకున పెడుతుంటే కవిత మరో వాదనతో మీడియా ముందుకు వస్తుండటం మంచిది కాదనే వాదన రాజకీయవర్గాల్లో మొదలైంది. పార్టీ ప్రయోజనం కోసమే సగానికి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించానని, మరో ఉద్దేశం లేదని ఆమె చెప్పుకుంటున్నా వేరే కారణాలే ఉన్నాయనే అభిప్రాయా లే వ్యక్తమయ్యాయి. తనపై అసత్య, కల్పిత ప్రచారాలు జరుగుతున్నా పార్టీ నుంచి సరైన స్పందన లేదని ఆమె తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం.

దూకుడుతో దూరం పెట్టిన నాయకత్వం

ఇదిలా ఉండగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కుమార్ చేతిలో 2019లో ఓటమి పాలైన తర్వాత కవిత రెండేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఈ పరిణామంతో తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్ ఆమెను పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టారు. నిజామాబాద్ జిల్లాలో క్వీన్ అనే స్థాయిలో తన అధికార దర్పాన్ని ప్రదర్శించిన విషయం తెలిసిందే. చాలా సందర్భాల్లో జిల్లా అధికారులు అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కాదని ప్రొటోకాల్ ఇచ్చి రాచమర్యాదలు కల్పించేవారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈమె దూకుడుతనంతో ఇద్దరూ నొచ్చుకుని, పార్టీ అధినేతకు




మొరపెట్టుకున్నారని సమాచారం. జిల్లాలోని ముఖ్య నాయకుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా కవితను బీఆరెస్ కార్యక్రమాలకు దూరం పెట్టారన్న చర్చ జరిగింది. ఏమైందో ఏమో కానీ ఆమెను పెద్దల సభకు పంపించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఎంపీగా ఓటమి పాలైన రెండేళ్ల తరువాత ఎమ్మెల్సీగా కవిత మళ్లీ క్రియాశీలకంగా మారారు. ఇక అప్పటి నుంచి గతేడాది ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తీహార్ జైలుకు వెళ్లే వరకు అదే దూకుడుతో పనిచేశారు. జైలు నుంచి వచ్చిన తరువాత తండ్రి కేసీఆర్ ఆమెను సముదాయించి, ఓదార్చినప్పటికీ రాజకీయంగా అంతగా ప్రాధాన్యం, ప్రాముఖ్యం ఇవ్వడం లేదన్న వాదనలు ఉన్నాయి. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కుమారుడు కేటీఆర్, ఇతర ముఖ్య నాయకులతో చర్చిస్తున్నారని అప్పట్లోనే వార్తలు వచ్చాయి. తండ్రితో పాటు అన్న కూడా తన పట్ల వివక్ష చూపుతున్నట్టు గ్రహించిన ఆమె సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయితే ఇటీవల వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కవిత ఫోటోలు కన్పించకుండా చేశారనే విమర్శలు ఉన్నాయి. సభా వేదిక ఖరారులో తన ప్రమేయం లేకపోవడం వంటి ఘటనలతో ఆమె మరింతగా ఆవేదన చెందారని తెలుస్తున్నది. ఇవి చదువుతుంటే.. సహజంగానే ఏపీలో షర్మిల, జగన్మోహన్‌రెడ్డి మధ్య పంతాలు పట్టింపులు, ఆస్తి, అధికార తగాదాలు గుర్తురాకమానవు. సోదరుడు జగన్‌తో విభేదించిన షర్మిల.. ‘కొత్త రాజకీయ జీవితం’ కోసం తెలంగాణ వచ్చారు. అధికారం, ఆస్తి కోసం సోదరుడితో అంతర్గతంగా పలుసార్లు పంచాయతీ పెట్టినా.. ఆయన ఖాతరు చేయకపోవడంతో తన తండ్రి పేరిట తెలంగాణలో పార్టీ పెట్టారు. కొద్ది నెలల పాటు తెలంగాణలో కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం, పరాయి రాష్ట్రం నాయకురాలిగా గుర్తింపు పొందడం, ముఖ్య నాయకులు నమ్మకపోవడంతో ఆమె తిరిగి ఏపీకి వెళ్లక తప్పలేదు. తెలంగాణలో రేవంత్ రెడ్డి బలం పుంజుకోవడంతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకుని, ఏపీకి పీసీసీ అధ్యక్షురాలు అయ్యారు. కాగా కల్వకుంట్ల కవిత పరిస్థితి ఒకే విధంగా ఉన్నప్పటికీ లక్ష్యాలు వేర్వేరు కావడం గమనించాల్సిన అంశం. తెలంగాణ ఉద్యమం నుంచి పోరాడుతున్న తనకు రాను రాను ప్రాధాన్యం, ప్రాముఖ్యం తగ్గిస్తున్నారనేది ఆమె వాదనగా చెబుతున్నారు. ఇన్నేళ్లు పోరాడిన తనకు అస్తిత్వంతో పాటు అధికారమే ముఖ్యమని ఆమె కొన్ని నెలలుగా చేస్తున్న పర్యటనలు చెప్పకనే చెబుతున్నాయి. అమెరికాలో కుమారుడి డిగ్రీ పట్టా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే ముందు తెలంగాణ జాగృతి అనుబంధ సంఘాలకు కన్వీనర్లను నియమించారు. సాధారణంగా రాజకీయ పార్టీల్లో అనుబంధ సంఘాలు, కార్యవర్గం ఉంటుంది. జాగృతి అనేది రాజకీయ పార్టీ కాదు కదా ఒక సాంస్కృతిక సంస్థ మాత్రమే. అలాంటి సాంస్కృతిక సంస్థలకు సైతం విభాగాల వారీగా కన్వీనర్లను నియమించడం ఆసక్తి రేపింది. తండ్రి, సోదరుడితో తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధమయ్యి వ్యూహాత్మకంగానే ఆమె అడుగులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వాట్ నెక్స్ట్?

అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తరువాత కవిత జాగృతిని రాజకీయ పార్టీగా మారుస్తారా? లేక ఆ సంస్థను గ్రామ స్థాయినుంచి మరింత బలోపేతం చేస్తారా? అనేది పలువురు ఎదురు చూస్తున్నారు. నిజానికి తనను పార్టీలో దూరం పెడుతున్న విషయాన్ని గమనించిన కవిత.. సొంతగానే పార్టీ పెట్టేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే తన విషయంలో జరుగుతున్న అన్యాయం, నిర్లక్ష్యంపై తన తండ్రి కేసీఆర్ కు లేఖ రాశారని అంటున్నారు. ఆ లేఖలో తన సోదరుడి వ్యవహారంపై పలు ప్రశ్నలు సంధించారంటున్నారు. పార్టీ స్థాపన నుంచి ఈ రోజు వరకు తాను చేసిన కృషి, కేటాయించిన సమయం, విస్తరణలో తన పాత్ర, 2014 తో పాటు 2018 ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం శక్తియుక్తుల ధారపోత వంటి అంశాలను ప్రస్తావించి, ఈ మధ్య తనను దూరం పెట్టడానికి గల కారణాలు ఏంటని ఆ లేఖలో లేవనెత్తారని తెలిసింది. మహిళలను పార్టీవైపు తిప్పుకోవడంలో పనిచేసినా తగిన గుర్తింపునివ్వడం లేదనే ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని ఆమె ప్రజా క్షేత్రంలోనే తన భవిత, బతుకు తేల్చుకోవాలనే ధృడ సంకల్పంతో ఉన్నట్లు చర్యలను బట్టి అవగతమవుతోంది.

# కాశ్మీర్ పండిట్లలో భరోసా నింపాలి

న్యూఢిల్లీ,బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడనుంది. పహల్గామ్ ఉగ్రదాడి, పాక్‌పై భారత్ చర్యలు, ఆపరేషన్ సిందూర్ తరవాత ఇక కాశ్మీర్ నేతల వైఖరి మారాలి. ముఖ్యంగా మెహబూబా ముఫ్తీ తనపాక్ అనుకూల వైఖరిని విడనాడాలి. ఫరూక్ అబ్దుల్లా కూడా మారాలి. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను ఆదినుంచీ గండికొట్టారు. అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలకు తోడు మెహబూబా ముఫ్తీ, అబ్దుల్లాలు పాక్‌తో కలసి దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు.అక్కడున్న పండిట్లను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. భారత్‌తో సంబధం లేకుండా కాశ్మీర్‌ను పెంచి పోషించారు. దీనికి ముమ్మాటికీ కాంగ్రెస్‌దే బాధ్యత. 370 రద్దుతో హురియత్ నేతలకు స్థానం లేకుండా పోయింది. అలాగే అక్కడి నుంచి తరిమి వేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. కాశ్మీర్‌లో అసలు జరుగుతున్నదేమిటో ప్రపంచానికి తెలిసింది. నిజానికి పండింట్లను ముందుగా వారిని తమ స్వస్థలాలకు పంపి రక్షణ కల్పించాలి. వారికి అక్కడే ఉద్యోగ, ఉపాధి కార్యాక్రమాలు కల్పించాలి. ఇప్పుడు అదొక పెద్ద టాస్క్‌గా తీసుకుని, దేశంలో ఎక్కడెక్కడో ఉంటున్న పండిట్లను తిరిగి కాశ్మీర్‌కు చేర్చాలి. అక్కడి ముఫ్తీలు,అబ్దుల్లాలే ఒక్కరే కాశ్మీర్ ప్రజలు కాదని గుర్తుంచుకోవాలి. కనీస మర్యాద, గౌరవం లేకుండా తామేదో ఇతర దేశస్థుల మాదిరిగా ఇంతకాలం నేతలు వ్యవహరిస్తూ వచ్చారు. ఇంతకాలం వారి పెడధోరణికి నిదర్శనంగా గుర్తుంచుకోవాలి. విచ్చిన్నకర ధోరణితో కాశ్మీర్‌లో మరింత ఆజ్యం పోస్తూ వచ్చారు. వారంతా కావాలని పాక్ కొమ్ముకాస్తూ భారత్‌లో వేర్పాటు వాద కార్యకలాపాలకు మద్దతు పలికారు. వీరంతా తాము అనుకున్న రీతిలో కాశ్మీర్ నడవాలని అనుకున్నారు. పాక్ వీరికి భారత్ వ్యతిరేక ఉగ్రవాదాన్ని నూరిపోస్తోంది. 370 ఆర్టికల్ కాశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా నిలవడమే గాకుండా కాశ్మీరీ పండింట్లకు చోటులేకుండా చేసింది. దీనిరద్దుతో ఇప్పుడు పండిట్లు తమ స్వస్థలాలకు చేరుకునే అవకాశం వచ్చినా అది సాకారం కావడం లేదు. కాశ్మీర్ సాధారణ స్థితికి రావాడం జీర్ణించుకోలేని ఉగ్రమూకలు పండిట్లను మళ్లీ లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారు. ముందు పండిట్లను కాశ్మీర్‌లో స్వేచ్ఛగా జీవించే చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే కాశ్మీర్ అందరిదన్న భావన ఉంటుంది. కాశ్మీరీ పండిట్లను జాడ లేకుండా తరిమేసినా గత ప్రభుత్వాలు ఏనాడూ అక్కడ నివారణ చర్యలు తీసుకుని అక్కడి ప్రజలను భారత్‌తో మమేకం చేయలేకపోయింది. రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి విషయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వచ్చాయి. బిజెపి కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించడంలో చొరవ తీసుకుంటున్నా దానిని విఫలం చేశారు. పాక్ పాలకులతో స్నేహం పెంచుకోవడం ద్వారా తీవ్రవాద గ్రూపులు కాశ్మీర్‌ను నిత్యం కల్లోల క్షేత్రంగా రగిలిస్తూనే ఉండాలని కొందరు నేతలు కోరుకుంటున్నారు. అందువల్ల ముందుగా కాశ్మీర్ నుంచి తరిమివేయబడ్డ పండిట్లను ఇతర ప్రాంత ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అలా చికిత్సకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే మిగతా వర్గాల ప్రజలు కూడా విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం కొంత కఠిన వైఖరినే కేంద్రం అవలంబించాలి. రాజకీయ లబ్ధికి స్థానిక అవకాశాలను ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాలి. నరేంద్రమోదీ ప్రభుత్వం కాశ్మీర్ సమస్య, కాశ్మీర్ పట్ల వివేకవంతమైన వైఖరితో ముందుకు వెళ్లడం స్వాగతించాలి. ప్రధాని మోడీ ప్రయత్నాలు ఫలించాలంటే ప్రతిపక్షం కూడా ఆయనకు బాసటగా ఉండాలి. అయితే పక్కలో బల్లెంలా ఉన్న పాక్ పాలకులు కాశ్మీర్‌లో ఆజ్యం పోస్తూ ఉగ్రవాదులను ఎగదోస్తున్నారు.

# దోచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమిటి

గుంటూరు, జగన్‌కి తండ్రి వైఎస్ రాష్ట్రాన్ని దోచుకోవడం మాత్రమే నేర్పారని, నాయ్యకత్వ లక్షణాలు బోధించలేదని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి దోచుకున్నారని అన్నారు. అవినీతిపరులే నేడు నీతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి రంగంతో సహా అనేక రంగాల్లో అభివృద్ధి తిరోగమనంలో సాగిందన్నారు. హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన తరవాత చంద్రబాబు అహోరాత్రులు కష్టపడుతూ ఎపిని ముందుకు తీసుకుని పోగా, దానిని వెనక్కి నెట్టే యత్నాల్లో జగన్ ఐదేళ్ల పాలన సాగిందని అన్నారు. తిరి గాడిలో పెట్టి అభివృద్దిలో పరుగెత్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న దశలో జగన్‌కి ఏమైనా అభిమానం ఉంటే తగిన విధంగా సహకారం అందించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో చెరువులు ఆక్రమించుకుంటే తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు తిరిగి అభివృద్ధి చేస్తోందని గుర్తు చేశారు. జగన్ పోలవరం సహా అన్నింటిని వెనక్కి మళ్లించే యత్నాలతో ఎపిని అధోగతి పాలు చేసిందని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై కోట్ల భారం మోపారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో ఏం అభివృద్ధిచేశారో వైసీపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. బూటకపు హామీలతో అధికారం చేపట్టారని, తర్వాత వాటిని గాలికి వదలి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. అన్నక్యాంటీన్, నిరుద్యోగ భృతి, ఎస్సీ, బీసీ, ఇతర కార్పొరేషన్లు ద్వారా పథకాలు, విదేశీ చదువులకు ఇచ్చే ప్రోత్సాహకాలు నిలిపివేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేలా ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. హామీలు గుప్పించడం, మభ్యపెట్టడం, ప్రజలు నెత్తిన భారం వేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా నేతల్లో మార్పు కానరావడం లేదన్నారు. వైసీపీ పాలనలో ఊరికో ఉన్మాది తయారయ్యారని.. ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే కిరాతకులు పెట్రేగారని అన్నారు.

అభివృద్ధి దిశగా తెలంగాణ పథకాలు

కరీంనగర్,దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో బృహత్తరమైన పథకాలు ప్రవేశపెట్టి ఏ ప్రభుత్వమూ ఎన్నడూ చేయని అభివృద్ధిని సిఎం రేవంత్ రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాల్లో దళితులకు పెద్దపీట వేస్తూ వారికి సహకారం అందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం అమలు చేయబోతున్నారని గుర్తుచేశారు. ఇకపోతే ధాన్యం కొనుగోళ్లకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని వెల్లడించారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# సేంద్రీయ ఎరువులతోనే లాభం

నిజామాబాద్,రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మట్టిలో పోషకాలను పెంచేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయా అధికారులు రైతులకు సూచించారు.. రసాయన ఎరువుల వినియోగం పెరిగి భూమికి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అన్నదాతలు ఈ విషయాన్ని గుర్తించి రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. రైతన్నలు మట్టిని కాపాడితే సమాజాన్ని కాపాడినవారు అవుతారన్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం కోల్పోయి పంట నాణ్యత హీనంగా వస్తుందన్నారు. తద్వారా ఆ పంటను స్వీకరించిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు,. వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయించుకుని రైతులు తమ పోలాల్లో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చన్నారు. అవసరమైనంత మేరకు నత్రజని పోటాష్‌లు, వినియోగించాలన్నారు అంతేకాకుండా భూమి యొక్క బౌతిక రసాయన స్థితిని బట్టి ఆభూమిలో ఏయే పంటలు పండుతాయి అనే విషయాన్ని కూడా తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. అధిక మొత్తంలొ రసాయనాలు వాడి భూమిలోని పోషకాలు తగ్గించకుండా భూమిని జాగ్రత్తగా కాపాడు కోవాల్సిన అవసరం రైతులపై ఉందన్నారు. భూసారం తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే తెలుసుకుని వాటిని అవలంబించాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పంటు పండే అవకాశం ఉందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలను భూమి ఇస్తుందని భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. ఇదిలావుంటే మండల స్థాయిలో, గ్రామీణ స్థాయిలో కూడా ప్రైవేట్ వ్యక్తులు మట్టి తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అధికారులను పాటించాలన్నారు. వర్మికంపోస్టు యూనిట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడేందుకు ప్రభుత్వం రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రధానంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలలో రసాయనాల వాడకం తగ్గించడం ద్వారా ప్రజలకు మేలైన కూరగాయలు అందేలా చేయాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగులో కంపోస్టు ఎరువుల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు రాయితీపై వర్మికంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వ్యక్తిగత మరుగుదొడ్ల పై నిర్లక్ష్యం

విజయనగరం,దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రచారం ఉధృతం చేసినా ఆశించన లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనికి తోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబందించినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు’ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి ఏళ్లు గడిచాయి. గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. ఏపీలో ఇప్పటికే లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాధమ్యంగా ప్రకటించింది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం. ప్రజల్లో నిర్లిప్తత తొలగాలి. పరిశుభ్రత పాటించకపోతే వ్యక్తిగతంగా తమకు, తద్వారా సమాజానికి చేటు జరగుతుందన్న విషయం ప్రచారం చేయాలి. ప్రజలను నిరంతర చైతన్యం చేయడం ద్వారానే సంపూర్ణ స్వచ్ఛత సాధించగలమని గుర్తించాలి.

# ‘భోగ్ భూమి’ కాదు..

గోవా:సాధారణంగా కాస్త లాంగ్ వీకెండ్ వచ్చినా, హాలిడేస్ లో బాగా ఎంజాయ్ చేయాలని భావించినా, సముద్ర తీరంలో సూర్యోదయాన్ని మరింత కొత్తగా ఆస్వాదించాలని అనుకున్నా ఎక్కువమంది యువత గోవాను ఒక బెస్ట్ ఆప్షన్ గా ఎంచుకుంటారని అంటారు. అయితే అది ఒకప్పుడు.. ఇప్పుడు గోవా బీచ్ ల కంటే ఎక్కువగా దేవాలయాలు, సంస్కృతి విషయంలో ఎక్కువమందిని ఆకర్షిస్తోందని అంటున్నారు సీఎం ప్రమోద్..అవును... గోవా ఒకప్పుడైతే సూర్యుడు, ఇసుక, సముద్రాన్ని ఎంజాయ్ చేస్తూ ఆనందించడానికి వచ్చేవారని అయితే.. ఇప్పుడు మాత్రం దేవాలయాలు, సంస్కృతి కోసం ఎక్కువమందిని గోవా ఆకర్షిస్తోందని.. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. ఈ సందర్భంగా గోవా ఇప్పుడు “భోగ్ భూమి” (ఆనంద భూమి) కాదు.. "యోగ భూమి" (భక్తి, యోగా భూమి), "గో మాత భూమి" (ఆవుల భూమి) అని అన్నారు.ఇదే సమయంలో... ఒకప్పుడు గోవాకు ప్రజలు వచ్చినప్పుడల్లా ఇది భోగ్ భూమిగానే అనుకునేవారు కానీ.. ఇది ఇప్పుడు యోగ భూమి అని అన్నారు. ఇక్కడ సనాతన సంస్థ శంఖనాద్ ఆశ్రమం కూడా ఉందని తెలిపారు. తాజాగా "సనాతన రాష్ట్ర శంఖనాద్ మహోత్సవ్" కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిని పరశురాముడి భూమి అని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా... విష్ణువు అవతారమైన పరశురాముడు అరేబియా సముద్రంలోకి బాణం వేసి, దాన్ని వెనక్కి నెట్టి గోవాని సృష్టించారని ముఖ్యమంత్రి సావత్ అన్నారు! ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్రంలోని బీచ్ ల కంటే ప్రత్యేకమైన, అందమైన దేవాలయాలు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలను స్థానిక సమాజాలే నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.సనాతన్ సంస్థ వ్యవస్థాపకుడు జయంత్ అథవాలే 83వ జయంతి సందర్భంగా ప్రసంగించిన సావంత్... గతంలో ప్రజలు సూర్యుడు, ఇసుక, సముద్రం చూడటానికి గోవాను సందర్శించేవారని.. అయితే, ఇప్పుడు అది మారిందని. ఇప్పుడు పర్యాటకులు మన గొప్ప సంస్కృతి, దేవాలయాలను అనుభవించడానికి ఇక్కడికి వస్తున్నారని తెలిపారు!

# హైదరాబాద్‌లో ఉగ్రదాడులపై సంచలన ప్రూఫ్స్..




హైదరాబాద్,హైదరాబాద్ పేలుళ్లకు కుట్ర కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సిరాజ్, సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక అంశాలు ప్రస్తావించారు. ఆరుగురు వ్యక్తులు ఇన్‌స్టా గ్రూప్ క్రియేట్ చేసుకున్నట్లు గుర్తించారు. సిరాజ్, సమీర్‌తోపాటు టీమ్‌లో కర్నాటక, మహారాష్ట్ర యువకులు కూడా ఈ గ్రూప్ లో ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో 3 రోజులపాటు కలిసి ఉన్న ఆరుగురు గ్యాంగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాలు అమలు చేయడంపై మీటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేయాలని ఐసిస్ ఆదేశం ఇచ్చిగా.. మిగతా నలుగురికి బాంబ్‌లు పెట్టె టార్గెట్లు గుర్తించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అమేజాన్‌లో టిఫిన్‌బాక్స్‌లు, వైర్లు, రిమోట్ సెల్స్ సిరాజ్..ఆర్డర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిన్న విజయనగరంలో సిరాజ్, హైదరాబాద్‌లో సమీర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విజయనగరం కోర్టు ఇద్దరికి 14 రోజులు రిమాండ్ విధించింది. అరెస్టు సమయంలో సిరాజ్ దగ్గర భారీగా పేలుడు పదార్థాలు గుర్తించారు. అమ్మోనియం నైట్రేట్, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను పోలీసులు సీజ్ చేశారు.సిరాజ్, సమీర్‌ను అరెస్ట్ చేసిన తర్వాత పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో చాలా కీలక అంశాలు వెల్లడించడం జరిగింది. మొత్తం ఆరుగురు యువకులు కలిసి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఉన్నారు. ఇక్కడ మహారాష్ట్రకు చెందిన యువకులతో పాటు కర్ణాటక యువకులు మొత్తం ఆరుగురు కలిసి ఒకే చోట ఉండి హైదరాబాద్ లో బాంబులు ఎక్కడెక్కడ అమర్చాలి, ఎలా తయారు చేయాలి వాటికి సంబంధించిన స్కెట్లు ఎలా గుర్తించాలి అని ప్లాన్లు వేశారు. అయితే సౌదీ, అరేబియన్ నుంచి వీరికి ఇంటర్నెట్ ద్వారా ఆదేశాలు వచ్చినట్టుగా గుర్తించారు. టిఫిన్‌బాక్స్‌లో బాంబులు తయారు చేసి అవి జనాభా ఎక్కువగా ఉండే ప్లేస్లో గుర్తించాలని ఆదేశాలు వచ్చినట్టుగా తెలుపారు. అయితే అమేజాన్‌లో టిఫిన్‌బాక్స్‌లు, వైర్లు, రిమోట్ సెల్స్ ఇవన్నీ ఆర్డర్ చేసి కొనుగోలు చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఎవరైతే సిరాజ్, సమీర్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రాం అకౌంట్స్ పైనా కూడా పోలీసులు నిగా పెట్టడంతో కుట్ర భగ్నం అయ్యిందని తెలిపారు.వీరు ఆన్‌లైన్ ద్వారనే ఉగ్రవాద అనుబంధాలకు ఆకర్షితులై హైదరాబాద్‌లో ఈ కార్యకలాపాలు చేసేందుకు ప్రయత్నించారని పోలీసులు గుర్తించారు. వీరికి సంబంధించిన పూర్తి వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఐసిస్ కి సంబంధించిన హ్యాండర్లను సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాలను అక్కడ అమలు చేసే విధంగా సిరాజ్, సమీర్ కూడా పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడించారు. అయితే వీరు 3 రోజులు ఎక్కడ ఉన్నారు.. వీరికి ఎవరు ఆశ్రయం కల్పించారు అనేది వివరాలు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే %చీఐూ% కూడా రంగంలోకి దిగింది. కేసుకు సంబంధించి అన్ని వివరాలు తెలుసుకుంటుందని చెప్పారు. మొత్తం ఆరుగురు యువకులు అని చెప్పారు.. మిగత నలుగురు ఎక్కడికి వెళ్లారు. వారికి సంబంధించిన వివరాలు పోలీసులు ఆరా తీస్తున్నారు. మొత్తం తెలంగాణ, ఆంధ్ర పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేయడంతో హైదరాబాద్‌లో బాంబులు పేల్చేందుకు కుట్ర భగ్నం చేయగలిగారు.అయితే (గ్రూప్ ప్రిపరేషన్ కోసం వచ్చిన సిరాజ్, సమీర్ ఇద్దరు ఎలా పరిచయమయ్యారు అనే దాని గురించి ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు పోలీసులు. వీరిని విచారిస్తే మరిన్ని విషయాలు బయటకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి 2 తెలుగు రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ సిరాజ్, సమీర్ కు ఎవరెవరు సహాయం చేస్తున్నారు.. వారికి బాంబులకు సంబంధించి ఎక్విప్మెంట్ కొనడానికి ఆర్థిక పరమైన సహాయం ఎవరు చేశారని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రపతి,గవర్నర్ చక్రవర్తులా?

హైదరాబాద్,అసెంబ్లీ బిల్లుల విషయమై సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాల గురించిన చర్చలు చాలా జరుగుతున్నా ప్రజాభిప్రాయం ఎట్లా ఉన్నదనే ప్రస్తావన మాత్రం ఎక్కడా రావటం లేదు. ఈ అంశంపై రాజ్యాంగం, చట్టాలు, గత వివాదాలు, తీర్పులలో విషయాలు చాలానే ఉన్నాయి. అవి అన్నీ ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి. అంతవరకు మంచిదే. అదే సమయంలో కొన్ని వివాదాలకు అసాధారణ స్వభావం ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది గమనించడం కూడా అవసరం. తమిళనాడు గవర్నర్ తీరును పురస్కరించుకొని తలెత్తిన సమస్య అటువంటిది. రాష్ట్రపతి, తదితరుల రాజ్యాంగ అధికారాలు ఏవైనా, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో వీరెవరూ మధ్యయుగాల నాటి చక్రవర్తులు కారు. అందరి అధికారాలకు మూలం ప్రజాభిప్రాయంలో ఉంటుంది.ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రజాస్వామిక వ్యవస్థలు ఏర్పడటం, రాజ్యాంగాలు, చట్టాలు రూపొందటం నిజమే. అటువంటప్పుడు, యథాతథంగా ఆలోచించినట్లయితే ప్రతి అంశంపై ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది అలోచించవక్కరలేదు. కొన్ని దేశాలలో వలె ప్రతి ముఖ్యమైన అంశంపై రెఫరెండం అవసరం లేదు. కానీ అదెప్పుడు? ఎన్నికైన అధికారపక్షం గాని, ప్రతిపక్షాలు గాని అటువంటి అభిప్రాయాలకు, అవి ప్రతిఫలించే రాజ్యాంగానికి, చట్టాలకు అనుగుణంగా, అక్షరబద్ధంగా, స్ఫూర్తిబద్ధంగా కూడా వ్యవహరించినప్పుడు, పాలించినప్పుడు. అప్పుడే అది ప్రజాస్వామ్యబద్ధ పాలన అవుతుంది. ప్రజలకు ఆమోదకరం అవుతుంది. అందుకు భిన్నంగా వ్యవహరించే అధికారాలు, హక్కులూ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు ఏ విధంగానైతే ఉండవో గవర్నర్లకు, రాష్ట్రపతులకు కూడా ఉండవు. ఎవరూ దైవాంశ సంభూతులు, గతకాలపు చక్రవర్తులు కారు. అందువల్ల, గవర్నర్లను, రాష్ట్రపతినే సుప్రీంకోర్టు ఆదేశిస్తుందా? అనే ప్రశ్న ఎంత మాత్రం అవగాహన లేని, విలువ లేని దురహంకార పూరితమైన వైఖరి మాత్రమే.ఇది చూసినప్పుడు అమెరికాలో జరుగుతున్నది గుర్తుకు వస్తున్నది. భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ అంటారు. నిజమే కాదా అన్నది అట్లుండి, ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని ప్రధాని మోదీ సగర్వం గా చాటిచెప్తుంటారు. అమెరికాను గొప్ప ప్రజాస్వామ్యమంటారు. ప్రస్తుతం ఈ రెండు ఘనమైన ప్రజాస్వామ్యాల్లో జరుగుతున్నది ఒకే విధంగా ఉండటం విశేషం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసదారులని చెప్పేవారి నుంచి మొదలుకొని, స్వయంగా తమ పౌరులు అయి నవారిపై, పరిపాలనా వ్యవస్థపై తీసుకుంటున్న పలు చర్యలపై కోర్టులు స్టే విధిస్తున్నాయి. కొన్నింటిని కొట్టివేస్తున్నాయి. ఆయా కోర్టు ఉత్తర్వులను ట్రంప్ ప్రభుత్వం పాటించడానికి బదులు బహిరంగంగా ధిక్కరిస్తున్నది. ఆ జడ్జీలను ప్రభుత్వంతో పాటు, ట్రంప్ అధికారాలు, అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీ నాయకులు బాహాటంగా వేదేపదే విమర్శిస్తున్నారు. వారిని ఇంపీచ్‌మెంట్‌తో పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకరిద్దరైతే, నమ్మశక్యం కాని రీతిలో, ఏదో సాకు చూపి అరెస్టు చేసే దాకా వెళ్లారు.ఒక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఇట్లా జరుగుతుండగా, మరొక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఏమి జరుగుతున్నది? గత చరిత్రను పక్కన ఉంచుదాం. తమిళనాడు బిల్లుల సంగతి చూద్దాం. అక్కడి అసెంబ్లీ ఒకటికి రెండుసార్లు రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆమోదించిన బిల్లులను కూడా అక్కడి గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచుతారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత సైతం నిబంధనలకు విరుద్ధంగా అప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపుతారు.బిల్లుల పట్ల ఆ విధమైన వైఖరి వల్ల రాష్ట్రంలో వేర్వేరు శాఖల పరిపాలన దెబ్బతింటుంది. అయినప్పటికీ ఆయన లెక్కచేయరు. ఇదే ఒక అప్రజాస్వామికమైన, రాజ్యాంగ విరుద్ధమైన దారుణ ప్రవర్తన కాగా, అంతకన్న దారుణమైనది మరొక స్థాయిలో జరుగుతుంటుంది. అది ఢిల్లీ స్థాయిలో. అక్కడి నుంచి అన్నీ గమనించే హోంశాఖ, హోంమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఎవరూ అది తగదని వారించరు. పరిస్థితిని సరిదిద్దరు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులు చేసినా పట్టించుకోరు. గవర్నర్ రవి ఇది చాలదన్నట్టు, తన అధికార పరిధులను బాహాటంగా అతిక్రమిస్తూ, అక్కడి అధికారపక్షమైన డీఎంకేకు వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తుంటారు. అటువంటి కార్యకలాపాలలో పాల్గొంటారు.గవర్నర్ రవికి ఒక ప్రతిష్ఠాత్మకమైన నేపథ్యం ఉంది. ఐపీఎస్ అధికారి అయిన ఆయన అందుకు సంబంధించిన పలు హోదాలలో పనిచేసిన తర్వాత, కొన్ని చోట్ల గవర్నర్‌గా కూడా ఉండిన వెనుక, నాగాలాండ్‌కు గవర్నర్‌గా నియమితులయ్యారు. సమస్యాత్మక ఈశాన్య భారత రాష్ట్రాలలో ఐపీఎస్ నుంచి, సైన్యం నుంచి రిటైరైన వారిని గవర్నర్లుగా నియమించడం ఎప్పటినుంచో ఉంది. అంతవరకు సరే. కానీ, వాటన్నింటిలో అతి క్లిష్టమైన, అతి సున్నితమైన నాగాలాండ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. పైగా అప్పుడు నాగా సంస్థలకు, కేంద్రానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అంతకుముందు అక్కడ పనిచేసిన వారిలో జనరల్



కె.వి.కృష్ణారావు ఉన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన కె.పద్మనాభయ్య నాగాలతో చాలాసార్లు చర్చలు జరిపారు. అప్పుడంతా వారు ఎంతో నేర్పుగా వ్యవహరించారు. కానీ, రవి తీరుతో విసుగెత్తిన నాగాలు ఆయనను తొలగిస్తే తప్ప చర్చలు జరుపబోమని ప్రకటించటంతో కేంద్రం తనను తమిళనాడుకు బదిలీ చేసింది. రాజకీయంగా ఆ రాష్ట్రం మరొక విధంగా సున్నితమైనది. కానీ, ఆయన తీరు మారలేదు. విషయం చిలికిచిలికి ప్రస్తుతం మనం చూస్తున్నట్లు గాలివానగా మారింది.అసలు సమస్య కేంద్రం వద్ద ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నచోట వాటిని రకరకాల ఇబ్బందులకు గురిచేయటం, వీలైతే పడగొట్టటం, అందుకు గవర్నర్లను ఉపయోగించుకోవటం. వాస్తవానికి ఈ అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ధోరణిని ఆరంభించింది కాంగ్రెస్ పార్టీ. ఆ దుష్ట సంప్రదాయాన్ని బీజేపీ కూడా కొనసాగిస్తున్నది. అప్పుడు కాంగ్రెస్‌కు నీతులు చెప్పిన తానిప్పుడు అదే పనిచేస్తున్నది. తమిళనాడు పొరుగున గల కేరళలో ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ఇటు తెలంగాణలో తమిళిసై, అటు పశ్చిమబెంగాల్‌లో ఆనందబోస్‌ల చర్యలు తెలిసినవే.ఇప్పుడు గవర్నర్ రవిని కేంద్రం ఇన్నిన్ని జరుగుతున్నా అదుపు చేయకపోగా, తమకు కొరకరాని కొయ్యగా మారిన డీఎంకేను ఆయన చికాకు పరచటాన్ని చూసి ఆనందిస్తున్నదనాలి. గవర్నర్ పదవి రాజ్యాంగపరమైనది అయినప్పుడు, రాజ్యాంగానికి అధినాయకత్వ స్థానంలో గల రాష్ట్రపతి ఏమి చేస్తున్నట్లు? పైకి కన్పించింది అయితే ఏమీలేదు. తను ఏమైనా చేసినా మనకు కన్పించలేదో లేక రబ్బర్ స్టాంప్ వలె వ్యవహరించారో తెలియదు.ఇంతకూ ఏప్రిల్ 8వ తేదీ నాటి తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందేమిటి? ప్రజలు రాజ్యాంగం ప్రకారం ఎన్నుకున్న చట్టసభలు నిబంధనల మేరకు ఆమోదించిన బిల్లులకు తమ స్థాయిలో ఆమోదం తెలుపటంలో గవర్నర్లు గాని, రాష్ట్రపతి గాని అసమంజసమైన జాప్యం చేయరాదని. నిబంధనలకు లోబడి పరిశీలించటం, పునఃపరిశీలన కోసం అసెంబ్లీకి తిప్పి పంపటం వంటివి సరే. కానీ, అవే నిబంధనలకు అనుగుణంగా అసెంబ్లీ తాను చేయవలసిందంతా చేసిన తర్వాత ఏదో ఒకటి తేల్చటంలో విపరీత జాప్యాలు ఎందుకు? అసెంబ్లీ రెండవసారి ఆమోదించినాక ఇక ఆపేందుకు వీల్లేదన్న నిబంధనను పాటించకపోవటమెందుకు? అట్లా జరిగినప్పుడు, అందులో రాజ్యాంగంతో నిమిత్తం లేని రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానం సహజంగా కలుగుతుంది. న్యాయమూర్తులు చేసింది, ఒకవైపు రాజ్యాంగ నిబంధనలకూ, స్ఫూర్తికి, మరొకవైపు ప్రజాస్వామిక పాలనకు అనుగుణంగా ఉండేట్లు, బిల్లుల ఆమోదానికి మూడు నెలల గడువు విధించటం మాత్రమే. గవర్నర్లకు, రాష్ట్రపతికి కూడా. మూడు నెలలకు మించితే ఆ బిల్లులు ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. అందులో ఆక్షేపించవలసిందేమి కన్పించదు. పైగా స్వయంగా కేంద్రమే ఇటువంటి గడువుతో 2016లో మూడు మెమోలు జారీచేసినట్లు కోర్టు గుర్తుచేసింది. నిజానికి రాష్ట్రపతి లేఖను అవకాశంగా తీసుకుని గవర్నర్లు, రాష్ట్రపతితో పాటు స్పీకర్ల అధికారాలు, పరిమితులను కూడా న్యాయమూర్తులు నిర్వచించినట్లయితే ప్రజాస్వామ్యానికి చాలా మేలు జరుగుతుంది. ఇంత జరిగి, ఇంత స్పష్టత వచ్చిన తర్వాతైనా కేంద్రప్రభుత్వం, అధికార పార్టీ వారు తమ తప్పిదాన్ని గుర్తించి వైఖరిని మార్చుకోలేదు. రాష్ట్రపతి ద్వారా రకరకాల సాంకేతిక ప్రశ్నలతో సుప్రీంకోర్టుకు లేఖ రాయించారు. అందువల్ల కోర్టు మౌలిక ఉత్తర్వుల పరిస్థితి మారేది ఏమీ ఉండదని, న్యాయనిపుణులు గతంలోనూ తలెత్తిన ఇదే విధమైన కేసులను ఉదహరిస్తూ స్పష్టం చేస్తున్నారు. గవర్నర్ రవికి సుప్రీంకోర్టు ఇదే బిల్లుల విషయంలో ఆదేశాలు జారీచేయగా, ఆయన కొన్ని ఆమోదించి, కొన్ని చేయక తన చమత్కారాన్ని ప్రదర్శించారు. దానిపై కోర్టు ఆగ్రహించి ఈ తాజా తీర్పు చెప్పింది. అయినప్పటికీ గ్రహించక రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా? అంటూ తమ అధికార దురహంకారాన్ని బీజేపీ నేతలు ప్రదర్శిస్తున్నారు. ఈ మొత్తం సంఘటనల పరంపరపై బయట ఈ దేశ ప్రజల అభిప్రాయాలు ఏ విధంగా ఉన్నాయో గమనించాలనే ఆలోచన ఎవరికైనా కలుగుతున్నదా? రాజ్యాంగ పీఠిక మొదటి వాక్యమే ‘ఈ దేశప్రజలమైన

# ప్రభుత్వ భూముల కబ్జాను సహించం

నెల్లూరు, ప్రభుత్వ భూములు ఆక్రమించాలన్న ఆలోచన మానుకోవాలని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని మంత్రి పొంగూరు నారాయణ వార్నింగ్ ఇచ్చారు. నెల్లూరు సిటీ అభివృద్ధిపై అధికారులు, కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు, కో-ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి.. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. త్వరలోనే సిటీ- నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామ అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడా ఆగటం లేదని స్పష్టం చేశారు.. ఇక, రాష్ట్రంలో 68 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.. 32 వేల కోట్లు- ప్రభుత్వానికి ఖర్చు అవుతోంది.. నిబంధనల ప్రకారం అనర్హుల కార్డులు మాత్రమే తొలగిస్తున్నామని వెల్లడించారు.. కానీ, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలని పట్టించుకోవద్దని మంత్రి పొంగూరు నారాయణ సూచించారు..

# నందిగం సురేశ్‌కు జూన్ 2వరకు రిమాండ్

గుంటూరు, వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయిలను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు- చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. 14 రోజుల పాటు రిమాండ్ విధించిన న్యాయస్థానం. దీంతో నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసుల్లో వైసీపీ మాజీ ఎంపీ బెయిల్‌పై ఉన్నారు. సోమవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో మాజీ ఎంపీని పోలీసులు హాజరుపర్చారు.. కోర్టు రిమాండ్ విధించింది.గత శనివారం రాత్రి మాజీ ఎంపీ స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో టీడీపీ కార్యకర్త రాజు అనే వ్యక్తిపై నందిగం సురేష్, అతడి సోదరుడు, అనుచరుడు మూకుమ్మడి దాడి చేశారు. తన భర్తపై హత్యప్రయత్నం చేశారంటూ రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. రాజును కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు- నిర్ధారించి నందిగం సురేష్‌తో పాటు- మరో కొంతమందిపై కేసు నమోదు చేశారు. నిన్న (ఆదివారం) సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈరోజు (సోమవారం) మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. సురేష్‌కు కోర్టు 14 రోజుల పాటు- రిమాండ్ విధించింది. వెంటనే అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. నెలల తరబడి నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు మాజీ ఎంపీపై 12 కేసులు ఉండగా.. ఇప్పుడు 13వ కేసు నమోదు అయినట్లు- తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. మరో రెండు కేసులు నమోదు అయితే నందిగం సురేష్‌పై పీడీ యాక్ట్ పెట్టేందుకు సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎయిర్ బేస్‌పై డ్రాగన్ కన్ను..

న్యూఢిల్లీ, భారత్ టార్గెట్ గా బంగ్లాదేశ్ చైనాతో చేతులు కలుపుతోందా? ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ కన్నేసిందా? ఓవైపు పాక్ కయ్యానికి కాలు దువ్వుతుంటే... చైనా సైలెంట్ గా బంగ్లాతో కలిసి పావులు కదుపుతోంది. ఇప్పటికే పాక్ తో కలిసి కశ్మీర్ లో ఇబ్బందులు కలిగిస్తున్న చైనా.. ఈశాన్య రాష్ట్రాలపై కన్నేసినట్టు తెలుస్తోంది. ఇందులో బంగ్లాదేశ్ ను డ్రాగన్ కంట్రీ పావుగా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. భారత్ ను దెబ్బతీసేలా బంగ్లాదేశ్ లో రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేసే దిశగా చైనా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ కంట్రీ కన్నేయాలని చూస్తోంది. ఎప్పుడో రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేయాలని చూస్తోంది. ఒకవేళ చైనా ఈ ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేస్తే భారత్ కు ఇబ్బందులు తప్పవు. ఇది భారత్ దేశ భద్రతకు పెద్ద ముప్పుగా మారనుంది. చైనా, బంగ్లాదేశ్ లు అభివృద్ధి చేసే ఎయిర్ బేస్ వెస్ట్ బెంగాల్ కు సరిహద్దుకు సిలిగురి కారిడార్ కు సమీపంలో ఉంటుంది.ఈ సిలిగురి కారిడార్ భారత్ లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను కలుపుతుంది. ఈ ఏడు రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ గా పిలుస్తారు. ఈ కారిడార్ చైనా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ లతో సరిహద్దులను పంచుకుంటుంది. ఇది భారత్ కు అత్యంత కీలకం. ఇక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా భారత్ తో మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు వేరవుతాయి. సిలిగురికి సమీపంలో బంగ్లాదేశ్ లోని లాల్ మోనిర్ హాట్ వైమానిక స్థావరాన్ని పునరుద్ధరించడంలో చైనా సాయం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ తన వైమానిక స్థావరాన్ని అభివృద్ధి చేయడంలో చైనా తన పనులను ముమ్మరం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ఎయిర్ బేస్ ను చైనా పూర్తి చేస్తే భవిష్యత్తులో భారత్ కు ఇబ్బందులు తప్పేలా లేవు.ఇటీవలే చైనా అధికారులు ఈ ఎయిర్ బేస్ ను సందర్శించినట్టు సమాచారం. ఇక్కడ కనుక చైనా లాల్ మోనిర్ హాట్ ఎయిర్ బేస్ ను పునరుద్ధరిస్తే.. ఇది భారత సైనికుల కదలికలను పర్యవేక్షించడానికి లేదా నిఘాను సేకరించేందుకు వీలు కల్పిస్తుంది. ఈ ఎయిర్ బేస్ దక్షిణాసియాలో చైనా తన ప్రాభవాన్ని విస్తరించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఎయిర్ బేస్ వల్ల బంగ్లాదేశ్ కు ప్రయోజనాలు ఉన్నా.. భారత్ కు భవిష్యత్తులో ముప్పు వచ్చే ప్రమాదం ఉంది. ముందుగా చైనా ఈ స్థావరాన్ని పరోక్షంగా తన సైనిక కార్యకలాపాల కోసం ఉపయోగించే అవకాశం ఉందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## మిర్చి రైతులకు స్టోరేజీలను ఇవ్వాలి

గుంటూరు: మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుండటంతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం నాయకులు విమర్శించారు. అక్రమంగా మహాలు చేస్తున్నా అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపించారు. అధిక కమిషన్, మద్దతు పేరుతో మిర్చియార్డులో అధిక వసూళ్లు దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్ కు చేయి కొట్టు కేటాయించి కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

## రాహుల్...కేటీఆర్...లోకేష్..ఈ పోలిక ఎందుకంటే?



హైదరాబాద్,రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత. ఆయన 2004లో తన 34 ఏళ్ళ వయసులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆయన ఇప్పటికి అయిదు సార్లు ఎంపీగా గెలిచారు. ఒకసారి అమేధీలో ఓడారు కూడా. రాహుల్ ది రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం. ఆయన ఈ క్రమంలో గాంధీ కుటుంబ వారసుడిగా ఏకంగా ప్రధాని పదవినే చేపట్టాల్సి ఉంది.ఎందుకంటే శ్రీమతి ఇందిరాగాంధీ రాజకీయాల్లోకి తొలుత రాజ్యసభ మెంబర్ గానే ప్రవేశించారు. అనతికాలంలోనే ఆమె కేంద్ర మంత్రి అయి రెండేళ్ళు తిరగకుండానే ప్రధానిగా 1966 జనవరిలో బాధ్యతలు స్వీకరించారు. అంటే కేవలం నాలుగైదేళ్ళ స్పాన్ లోనే ఆమె అగ్రాసనం అధిరోహించారు అన్న మాట. ఇక రాజీవ్ గాంధీ విషయానికి వస్తే 1981లో కాంగ్రెస్ ఎంపీగా అమేధీ నుంచి గెలిచారు. 1984లో ఆయన డైరెక్ట్ గా ప్రధాని అయిపోయారు. అంటే కేవలం మూడేళ్లలోనే అసలు కేంద్ర మంత్రి కూడా చేయకుండానే ఉన్నతాసనం అందుకున్నారు అన్న మాట. ఇక రాహుల్ గాంధీ చూస్తే ఎప్పటికీ ఎంపీగానే ఉన్నారు.దానికి కారణం ఆయన యూపీయే వన్ టూ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా కొంతకాలం పనిచేసి ఉంటే ఆ ప్రభుత్వం రెండవ టెర్మ్ లో కచ్చితంగా ప్రధాని అయి ఉండేవారు. కానీ రాహుల్ గాంధీ అప్పట్లో పదవుల మీద పెద్దగా ఆసక్తి చూపించలేదు, సోనియాగాంధీ సైతం 2014లో రాహుల్ ప్రధాని అని ఒక వ్యూహంతో ముందుకు సాగారు. అలా ఆమె ఒక యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకుంటే 2014 లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఆనాటి నుంచి బీజేపీ మూడు సార్లు గెలిచింది. గత పదకొండేళ్ళుగా బీజేపీ ఏలుబడిలో దేశం ఉంది.దాంతో రాహుల్ కి ప్రధాని పదవి అందని పండు అవుతోంది. 2029 నాటికి ఆయనకు ఆ పదవి దక్కితే ఓకే. కానీ లేకపోతే మరి ఎప్పటికి అందుతుంది అన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారు. దీనికి కారణం యూపీయే రెండు టెర్మ్ములు అధికారంలో ఉండగా చేతిలో అవకాశం ఉండగా రాహుల్ గాంధీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయారు అన్నది రాజకీయ వర్గాలలో బలంగా వినిపిస్తున్న మాట. ముఖ్యంగా వారసులు ఎదిగి వచ్చిన పార్టీల అధినేతలకు రాహుల్ ఎపిసోడ్ ఒక హెచ్చరికగా మారుతోందిట.కట్ చేస్తే తెలంగాణాలో బీఆర్ఎస్ లో మరో వారసుడు కథ ఇలాగే ఉంది. ఆయనే కేటీఆర్. కేసీఆర్ కి రెండు సార్లు జనాలు ఆదరించి అధికారం అప్పగించారు. అయితే కేసీఆర్ తాను రెండవ టెర్మ్ సీఎం గా ఉండగా కేటీఆర్ కి పట్టాభిషేకం చేసి సీఎం గా చేస్తారు అని వార్తలు పెద్ద ఎత్తున వచ్చాయి కానీ ఎందుకో అది అలా ఆలస్యం అవుతూ వచ్చింది. ఇక టీఆర్ఎస్ ని బీఆర్ఎస్ గా మార్చడం వెనక కూడా కేసీఆర్ తమ కుమారుడిని సీఎం గా చేసి జాతీయ రాజకీయాల్లోకి వెళ్ళేందుకే అని కూడా అంటూ వచ్చారు.అయితే 2023లో జరిగిన ఎన్నికల వరకూ వేచి చూసి కేటీఆర్ కి సింహాసనం అప్పగిస్తారు అన్నది కూడా వినవచ్చింది. తీరా 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ దారుణమైన పరాజయం మూటకట్టుంది. దాంతో మరో అయిదేళ్ళ పాటు కేటీఆర్ ఎదురుచూడాల్సి వస్తోంది అని అంటున్నారు.ఈ రెండు ఎపిసోడ్స్ ఇపుడు ఎందుకు అంటే ఏపీలో టీడీపీలో వీటి మీదనే ఎపుడూ చర్చ సాగుతూ వస్తోందిట. లోకేష్ టీడీపీకి వారసుడిగా ఉన్నారు. ఆయనకు పార్టీలో ఎవరూ పోటీలో లేరు. అయితే ఆయన పట్టాభిషేకానికి మాత్రం ఇంకా చాలా సమయం ఉంది అని అంటున్నారు.అయితే లోకేష్ కి ఉన్నత పదవులు దక్కాలని కోరుకునే వారు ఆయన అభిమానులు మాత్రం పై రెండు ఎపిసోడ్స్ చూపించి ఆలస్యం పదవికి మరింత దూరం అన్న సత్యాన్ని గుర్తు చేస్తున్నారుట. మహానాడులో లోకేష్ ని టీడీపీకి భావి వారసుడిగా ప్రకటించాలని ఒక డిమాండ్ అయితే అంతర్లీనంగా ఉందిట.మరి ఉప ముఖ్యమంత్రిగా చేస్తే బాగానే ఉంటుంది. కానీ ఒకే ఒక్క డిప్యూటీ సీఎం పదవి ఉండాలని అది పవన్ కే ఇవ్వాలని ఒక షరతు మీదనే జనసేనతో టీడీపీ పొత్తు కుదిరింది అని అంటున్నారు. దాంతో ఉప ముఖ్యమంత్రి పదవి రెండవది ఉండదని అంటున్నారు. పార్టీ ప్రెసిడెంట్ పదవి ఇవ్వవచ్చు కానీ జనాలు మ్యాండేట్ ఇచ్చింది చంద్రబాబుకే. అలాగే పార్టీ జనాలలో సీనియర్లు తటస్థులు ఇంకా బాబు మరికొంతకాలం అధ్యక్షుడిగా ఉండాలని కోరుకుంటున్నారుట. మొత్తం మీద చూస్తే కనుక లోకేష్ కి ఏ పదవి ఇస్తారు అన్నది చర్చగా ఉంది.ఏది ఏమైనా లోకేష్ బాబు తరువాత వారసుడు అన్నది మాత్రం తెలుస్తూనే ఉంది. చేతిలో పదవి ఉంది, కానీ అది అందడానికే ఆలస్యం అవుతోంది అని అంటున్నారు. సో దేశంలో ఇతర వారసుల విషయంలో జరిగిన తప్పులు లోకేష్ విషయంలో జరగకుండా వీలైనంత తొందర పడాలని హితైషులు కోరుతున్నారుట. మరి అది ఎపుడు జరుగుతుంది ఏమిటి అన్నది చర్చగానే ఈ రోజుకి ఉంది.

## గుల్జార్ హౌస్ విషాదం.. సర్కార్ నిర్లక్ష్యమేనా?



హైదరాబాద్, విశ్వనగరంగా విరాజిల్లుతున్న హైదరాబాద్ నగరంలో ఓ వైపు ప్రపంచ సుందరి ఎంపిక పోటీలు సాగుతున్న తరుణంలో ఓ అగ్ని ప్రమాదంలో 17మంది మృత్యువాత పడటం సహజంగానే రాష్ట్ర రాజధాని ప్రతిష్ఠను మసకబార్చింది. పాతబస్తీలో పేరెన్నికగన్న గుల్జార్ హౌస్ భవనంలో చెలరేగిన అగ్నిప్రమాదం తీవ్రత కంటే సహాయక చర్యల్లో డొల్లతనమే అధిక ప్రాణనష్టానికి బలమైన కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపత్తుల నిర్వహణ, నివారణకు సంబంధించిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం హోంశాఖ పరిధిలో పనిచేస్తుంది. ప్రస్తుతం ఈ శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలోనే ఉంది. అంటే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైఫల్యానికి బాధ్యత సహజంగానే సీఎం రేవంత్ రెడ్డి మీద ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించి.. బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియాతో సరిపెట్టారు. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఫైర్? టీమ్? తమ శక్తి యుక్తులు ప్రదర్శించిందని ప్రకటన చేశారు.

### కనిపించని విపత్తు నిర్వహణ.. నివారణ చర్యలు

వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణ.. తదుపరి వచ్చే వర్షకాలం విపత్తులపై ముందుస్తు సమీక్షలు, సన్నాహాలు, మాక్ డ్రిల్స్ వంటివేవీ ఈ ఏడాది జీహెచ్ఎంసీలో కనిపించలేదు. అందరి దృష్టి పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం మొదలైన ఆపరేషన్ సిందూర్ పరిస్థితులు.. స్థానికంగా జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలపైనే ఉన్న తరుణంలో విపత్తుల నిర్వహణ.. నివారణ అంశాలపై నిర్లక్ష్యం ప్రబలినట్లయ్యింది. అది ఎంతగా అంటే.. కనీసం ఆంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, ఫైర్ ఇంజిన్లలో నీళ్లు.. ఫైర్ బ్రిగేడ్‌కు సరైన మాస్కులు ఉంటే గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం తగ్గేదని బాధితులు పేర్కొనడమే నిదర్శనంగా చెప్పవచ్చు. లక్షన్నర కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రాజధానిలో తలెత్తే విపత్తుల నివారణలోనే ప్రభుత్వం యంత్రాంగం విఫలమవ్వడం.. అది కూడా కనీస వసతులు లేక రెస్క్యూ ఆపరేషన్ వైఫల్యం చెందడం విచారకరమంటున్నారు నగర వాసులు.

### హైడ్రాతో అంచనాలు తలకిందులు

జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రత్యేక ఫైర్ సేఫ్టీ వింగ్‌ను గతంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ఈవీడీఎంకు బదిలీ చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈవీడీఎం విభాగాన్ని హైడ్రాలో భాగంగా చేసేసింది. అయితే హైడ్రా ఏర్పాటు తర్వాత అందులో భాగమైన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విధులపై ఫోకస్ తగ్గి బుల్డోజర్లతో చెరువులు భూముల సంరక్షణ, ఆక్రమణల తొలగింపు, అక్రమ నిర్మాణాలు కూల్చివేతలే ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీలు కొన్ని నెలలుగా ఫైర్ సేఫ్టీపై కనీస సమీక్షలు చేయకపోవడంతో విపత్తుల నిర్వహణ.. నివారణ వ్యవహారాలు బలహీనపడిపోయాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు తలెత్తే ప్రమాదమున్న భవనాలు.. నిర్మాణాలపై తనిఖీలు కూడా కరువయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 137 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఆ శాఖ సిబ్బందికి తోడుగా తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగంనుంచి వెయ్యి మంది ఈ దళంలో విధులు నిర్వహిస్తారు. ఈ టీంకోసంకొత్తగా 20 బస్సులు, ట్రక్కులు, బొలేరోలతో పాటు 40 వాటర్?బోట్లు కొనుగోలు చేశారు. ఇటీవల హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభం సందర్భంగా 122 వాహనాలను కొత్తగా సీఎం రేవంత్ రెడ్డి అందించారు. అయితే హైడ్రా నుంచి డిజాస్టర్ మేనేమెంట్ సేవలు మాత్రం ఇంకా ఆశించిన స్థాయిలో సాగడం లేదన్న విమర్శలు బలంగా వ్యక్తమవుతున్నాయి. వేసవి అగ్ని ప్రమాదాలతో పాటు పరిశ్రమలు, సంస్థలలో చెలరేగే ప్రమాదాలు.. ముంచుకొస్తున్న వర్షాకాలం వరదలు హైడ్రాకు సవాల్ విసురుతున్నాయి.

### డీఆర్ఎఫ్ సిబ్బంది ఎక్కడ?

భారీ అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపం వంటి విపత్తులు సంభవించినప్పుడు ఎమర్జెన్సీ సహాయ చర్యలు చేపట్టడానికి తెలంగాణ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 2వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ దళాన్ని ఏర్పాటు చేశారు. అగ్నిమాపకశాఖలోని ఫైర్?స్టేషన్లు ఎస్డీఆర్ఎఫ్ స్టేషన్లుగా మార్పు చెందాయి. పట్టణాలలో వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, భవనం కూలిపోవడం వంటి విపత్తుల సమయాల్లో సహాయ చర్యలపై శిక్షణ అందించారు. మంటలనే ఆర్పే పద్ధతులు, రెస్క్యూ మెథడ్స్, పట్టణ వరదలపై అవగాహన, భవనం కూలిపోవడం నుంచి ప్రజలను రక్షించడం, ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ విధానంలో భాగంగా సీపీఆర్, ప్రథమ శిక్షణ, యోగా వంటి వాటిపై అవగాహన కల్పించారు. అయితే ఆ వ్యవస్థ సేవలు ఎంతవరకు ఉపయోగపడ్డాయన్నది గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద ఘటన సందర్భంగా ప్రశ్నార్థకమైంది. వారికి సరైన ఎక్యూప్ మెంట్లు లేకపోవడంతోనే ప్రమాదం తీవ్రత అధికమైందన్న ఆరోపణలు ఇక్కడ గమనార్హం. హైడ్రాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కు 70క బృందాలు..3,500 వరకు సిబ్బంది ఉన్నారు. గతంలో పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా తక్కువ మార్కుల వల్ల పోలీస్ ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన సుమారు 150 మందిని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) ద్వారా హైడ్రాలోకి తీసుకున్నారు. 1050 మంది వివిధ హోదాల్లోని పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన ఆఫీసర్లు, సిబ్బందిని హైడ్రాకు కేటాయించగా వారంతా ఎక్కడకు పోయారన్నది కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## జగన్ ట్రాప్‌లో కూటమి సర్కారు.. ఏం జరిగింది..!




అమరావతి,రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెరిగిందని.. జగన్ హయాం కంటే కూడా.. తమ ప్రభుత్వం పన్నులు, సిస్తు.. ఇతర ఎగుమతుల విషయాల్లో దూకుడుగా ఉందని కూటమి ప్రభుత్వమే తాజాగా లెక్కలు సహా వివరించింది. జగన్ మీడియా కావొచ్చు.. వైసీపీ నాయకులు కావొచ్చు.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెరగడం లేదని.. జగన్ హయాంలో వచ్చిన రాబడి రావడం లేదని పేర్కొన్నారు. అంతేకాదు.. గతాన్ని ప్రస్తుతాన్ని కూడా పోల్చారు.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కాదు.. కాదు.. గత ఆరు మాసాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందంటూ.. పెద్ద ఎత్తున లెక్కలు వండి వార్చింది. ఈ విషయాలు గణాంకాలతో సహా.. సర్కారు అనుకూల మీడియాలోనే వచ్చాయి. అయితే.. ఇక్కడే పెద్ద సమస్య ఎదురైంది. వ్యూహాత్మకంగా జగన్ ట్రాప్‌లో సర్కారు పడిపోయింది. వాస్తవానికి వైసీపీ నాయకులు.. జగన్ కూడా.. సర్కారును ఇరుకున పెట్టాలన్న వ్యూహంతోనే సదరు లెక్కలు వండివార్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదాయంలో వెనుకబడిందని.. అదే జగన్ అయితే.. ఆదాయాన్ని సంపాయించారని.. పథకాలను అమలు చేశారని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉంటే సరిపోయేది. కానీ.. ఇక్కడే సంపద పెరిగిందని, జగన్ కంటే ఎక్కువగానే సంపద పెంచుతున్నామని చెప్పుకొచ్చింది. ఆ వెంటనే వైసీపీ మరో వ్యూహం పన్నింది. మరి సంపద పెరిగినప్పుడు.. సూపర్ సిక్స్‌ను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీసింది.ఈ పరిణామం.. ప్రజల్లోకి కూడా వెళ్లిపోయింది. నిన్న మొన్నటి వరకు చంద్రబాబు.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లేదని.. వ్యవస్థలను బాగు చేసే పనిలో ఉన్నామని.. అందుకే సూపర్ సిక్స్‌ను అమలు చేయడం కష్టంగా మారిందని.. ఇటీవల కర్నూలులోనూ వ్యాఖ్యానించారు. ఆ తదుపరి వారంలోనే వైసీపీ ట్రాప్ చేసింది. దీనిలో పక్కాగా కూటమి సర్కారు ఇరుక్కుంది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం ఉన్నా.. సంక్షేమం ఇవ్వడం లేదన్న చర్చ ప్రారంభమైంది.ఈ విషయం తెలిసిన వెంటనే చంద్రబాబు ఇప్పుడు పథకాలు అమలు చేస్తామని ప్రకటించాల్సి వచ్చింది. అలా కాకుండా.. ఉంటే.. మరో ఆరు మాసాలైనా జనం సూపర్ సిక్స్ గురించి పెద్దగా ఆలోచించే వారు కారని.. అప్పుడు ప్రభుత్వానికి కొంత సమయం దక్కి ఉండేదని పరిశీలకులు, పార్టీ నాయకులు కూడా చెబుతున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు ముందు రోజు ఐఎస్ఐతో టచ్‌లో జ్యోతి మల్హోత్రా?



ఇస్లామాబాద్:పాకిస్తానీ హైకమిషన్‌లో పనిచేసే ఎహసాన్ ఉర్ రహీం ఆమెను హనీట్రాప్‌లో పడేశారని తెలుస్తున్నది. అతడిని జ్యోతి మల్హోత్రా డానిష్‌జీ అని సంబోధించేది. 2023లో వారు తొలిసారి కలుసుకున్నారు. బాలి, ఇండోనేషియా దేశాలకు కూడా వెళ్లొచ్చారు. పహల్గామ్ దాడి నేపథ్యంలో పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు కలిగి ఉన్నట్టు ఆరోపణలు వస్తున్న వ్లై వ్లాగర్ జ్యోతి మల్హోత్రా విషయంలో కొత్త విషయాలు బయటపడుతున్నాయి. పహల్గామ్‌లో భీకర దాడికి మూడు నెలలు ముందు జ్యోతి మల్హోత్రా పహల్గామ్‌ను సందర్శించినట్టు న్యూస్ 18 పేర్కొన్నది. ఈ కేసులో ఇప్పటికే జ్యోతి మల్హోత్రాపై అధికార రహస్యాల చట్టంలోని 3, 4, 5 సెక్షన్లతోపాటు.. భారతీయ న్యాయ సంహితలోని 152వ చట్టం కింద అభియోగాలు నమోదయ్యాయి. సదరు యూట్యూబర్.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి సరిగ్గా ఒక రోజు ముందు అంటే మే 6వ తేదీన పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేసే తన హ్యాండ్లర్ డానిష్‌తో టచ్‌లో ఉన్నట్టు తేలిందని అధికారవర్గాలను ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొన్నది. తాజా సంగతులు బయటపడుతున్న నేపథ్యంలో జమ్ము కశ్మీర్ మాజీ డీజీపీ శేష్‌పాల్ వైద్ ఎక్స్‌లో పలు కీలక ప్రశ్నలు సంధించారు. జ్యోతి మల్హోత్రా 2025 జనవరిలో పహల్గామ్ సందర్శనకు వెళ్లడం యాదృచ్ఛికమేనా? అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఆమె కొద్దికాలానికే పాకిస్తాన్ వెళ్లింది. పహల్గామ్ దాడికి ముందు అది మొత్తంగా నాలుగో సందర్శన అని ఆయన తెలిపారు.పాకిస్తానీ హైకమిషన్‌లో పనిచేసే ఎహసాన్ ఉర్ రహీం ఆమెను హనీట్రాప్‌లో పడేశారని తెలుస్తున్నది. అతడిని జ్యోతి మల్హోత్రా డానిష్‌జీ అని సంబోధించేది. 2023లో వారు తొలిసారి కలుసుకున్నారు. బాలి, ఇండోనేషియా దేశాలకు కూడా వెళ్లొచ్చారు. గూఢచర్య కింద డానిష్‌ను పర్సోనా నాన్ గ్రాటాగా మే 13న ప్రకటించింది. ఇది స్పానిష్ పదం. దీని అర్థం.. ఆమోదించబడని వ్యక్తి అని. వాస్తవానికి జ్యోతి మల్హోత్రాను ఐఎస్ఐ హ్యాండ్లర్స్‌కు పరిచయం చేసిందే డానిష్. ఐఎస్ఐ ఆపరేటివ్స్‌లో షకీర్ అలిసా రాణా షెహబాజ్ అనే వ్యక్తితో జ్యోతి సన్నిహితంగా ఉండేది. అతడి నంబర్‌ను తన ఫోన్ కాంటాక్ట్స్‌లో జాట్ రాంధ్వానా అని ఫీడ్ చేసుకుంది. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా వారికి ఆమె సమాచారం షేర్ చేసేదని తెలుస్తున్నది. 2024 సెప్టెంబర్‌లో ఒడిశాలోని పూరీలో పరిచయం అయిన మరొక ఫిమేల్ యూట్యూబర్‌తో కూడా ఆమె టచ్‌లో ఉండేదని తెలుస్తున్నది. ఒడిశాకు చెందిన ఆ మహిళ కూడా కార్తాపూర్ కారిడార్ ద్వారా పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చింది.ఈ కేసులో జ్యోతితో పాటు మొత్తం పది మందిని ఇప్పటి వరకూ అరెస్టు చేశారు. వీరిలో ఇటీవల పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి అరెస్టయినవారు కూడా ఉన్నారు. పంజాబ్‌లో అరెస్టయిన సుఖ్‌ప్రీత్ సింగ్, కర్ణబీర్ సింగ్.. దళాల కదలికలు, వ్యూహాత్మక ప్రాంతాలు సహా ఆపరేషన్ సిందూర్‌పై రహస్య సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశారు. హర్యానాలో అర్మాన్ అనే వ్యక్తిని నుహ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అతడు పాకిస్తానీ నంబర్లకు ఫొటోలు, వీడియోలు పంపినట్టు గుర్తించారు.

## శరణార్థులకు చోటు లేదు: సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు!



న్యూఢిల్లీ,శరణార్థులకు భారతదేశంలో ఆశ్రయం ఇవ్వలేమని సుప్రీంకోర్టు ఒక సంచలన తీర్పును వెలువరించింది. "భారత్ ఏదో ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఉచితంగా ఉండే ధర్మశాల కాదు" అని తేల్చి చెప్పింది. అంతేకాదు, దేశంలో ఉన్న శరణార్థులు వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలంక శరణార్థులు వేసిన ఒక పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది."ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వాలా? ఇప్పటికే మనకు 140 కోట్ల మంది జనాభా ఉన్నారు. మనం అన్ని ప్రాంతాల నుంచి వచ్చే విదేశీయులకు వినోదం అందించే ధర్మశాల కాదు" అని జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. శ్రీలంకకు చెందిన ఒక తమిళ వ్యక్తిని నిర్బంధంలో ఉంచడాన్ని సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి కోర్టు నిరాకరించింది.ఈ కేసును జస్టిస్ కె వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు వివరిస్తూ.. అతను శ్రీలంకకు చెందిన తమిళ వ్యక్తి అని, వీసాపై భారతదేశానికి వచ్చాడని, ఒకవేళ తన స్వదేశానికి తిరిగి వెళ్తే ప్రాణాలకు ముప్పు ఉందని వాదించారు. అంతేకాకుండా, పిటిషనర్‌ను దాదాపు మూడు సంవత్సరాలుగా ఎలాంటి బహిష్కరణ ప్రక్రియ లేకుండా నిర్బంధంలో ఉంచారని కూడా ఆయన కోర్టుకు తెలిపారు.దీనికి జస్టిస్ దత్తా స్పందిస్తూ.. "ఇక్కడ స్థిరపడటానికి మీకు ఏ హక్కు ఉంది?" అని సూటిగా ప్రశ్నించారు. పిటిషనర్ ఒక శరణార్థి అని, అతని భార్య, పిల్లలు భారతదేశంలో స్థిరపడ్డారని పిటిషనర్ తరపు న్యాయవాది మళ్లీ నొక్కి చెప్పడానికి ప్రయత్నించారు. అయితే, జస్టిస్ దత్తా స్పందిస్తూ చట్ట ప్రకారం ఏర్పాటు చేసిన విధానం ప్రకారమే పిటిషనర్ స్వేచ్ఛను హరించడం జరిగిందని, ఇందులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఉల్లంఘన ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, భారతదేశంలో స్థిరపడే ప్రాథమిక హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం కేవలం భారతీయ పౌరులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని జస్టిస్ దత్తా తేల్చి చెప్పారుపిటిషనర్ తన స్వదేశంలో ప్రాణాలకు ముప్పు ఎదుర్కొటున్నాడని న్యాయవాది ఆందోళన వ్యక్తం చేసినప్పుడు, జస్టిస్ దత్తా మరింత కఠినంగా స్పందిస్తూ "వేరే దేశానికి వెళ్లిపో" అని సూచించారు. ఇదిలా ఉండగా, ఇటీవల రోహింగ్యా శరణార్థులను భారతదేశం నుంచి బహిష్కరించే విషయంలో జోక్యం చేసుకోవడానికి కూడా సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే.ఈ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే.. 2015లో పిటిషనర్‌ను మరో ఇద్దరితో పాటు ఎల్‌టిటిఇ కార్యకర్త అనే అనుమానంతో క్యూ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. 2018లో, ట్రయల్ కోర్టు పిటిషనర్‌ను యుఎపిఎ (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) సెక్షన్ 10 కింద నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి 10 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు అతని శిక్షను 7 సంవత్సరాలకు తగ్గించింది. కానీ, అతను తన శిక్ష పూర్తి చేసుకున్న వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని, అతను భారతదేశం విడిచి వెళ్లే వరకు శరణార్థి శిబిరంలోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.పిటిషనర్ తన వాదనలు వినిపిస్తూ, 2009లో శ్రీలంక యుద్ధంలో ఎల్‌టిటిఇ మాజీ సభ్యుడిగా పోరాడినందున, తనను శ్రీలంకలో బ్లాక్ గెజిటెడ్‌గా ఉంచారని తెలిపారు. అందువల్ల, తనను తిరిగి అక్కడికి పంపిస్తే, అరెస్టు చేసి హింసిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తన భార్య అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతోందని, తన కుమారుడు పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుతో బాధపడుతున్నాడని కూడా ఆయన కోర్టుకు విన్నవించుకున్నారు.

## అనిల్ డిఫెన్స్ లో పడిపోయారా? అందుకేనా ఎదురుదాడి!



నెల్లూరు: మాజీ మంత్రి, నెల్లూరు వైసీపీ నేత అనిల్ కుమార్ యాదవ్ వ్యవహారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో నరసారావుపేట ఎంపీగా పోటీ చేసి ఓటమి చవిచూసిన అనిల్ కుమార్ యాదవ్ గత కొంతకాలంగా సైలెంటుగా ఉన్న విషయం తెలిసిందే. అధికారంలో ఉండగా, నెల్లూరులోని పార్టీ నేతలు అందరితోనూ విభేదాలతో సతమతమైన అనిల్ కుమార్ యాదవ్ ఇప్పుడు ఆకస్మాత్తుగా స్టైట్ మార్చినట్లు కనిపిస్తున్నారు. ఇన్నాళ్లు సైలెంటుగా ఉన్న ఆయన ఒక్కసారిగా స్వరం పెంచి హాట్ కామెంట్స్ చేస్తుండటం చర్చనీయాంశమవుతోంది.కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలను వరుసగా అరెస్టుచేసి జైలుకు పంపుతున్న నేపథ్యంలో అనిల్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు ఆసక్తి రేపుతున్నాయి. తనను టచ్ చేస్తే మీ అందరి జాతకాలు బయటపెడతానని ఇటీవల ఆయన చేసిన హెచ్చరిక తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పటికే వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ పై కేసు నమోదు అవడంతో ఆయన అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్న హెచ్చరికలు ఇంట్రెస్టింగుగా మారుతున్నాయి. ముఖ్యంగా కూటమిలోని బడా నేతలుగా ముద్రపడిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను లక్ష్యంగా చేసుకుంటూ అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్న విమర్శలు చర్చకు దారితీస్తున్నాయి.గతంలో ఎంపీ వేమిరెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ కలిసిపనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తన జోలికి వస్తే అప్పటి విషయాలను చెప్పేస్తానని అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్న హెచ్చరికలు ఎంపీ వేమిరెడ్డి వర్గంలో చర్చకు దారితీస్తున్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా టీడీపీలో కీలక నేతగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర వ్యవహరిస్తున్నారు. ఆయనను కూడా వదిలిపెట్టనని మాజీ మంత్రి అనిల్ యాదవ్ చెప్పడంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కూటమి పార్టీల నేతలు తన వరకు రాకూడదనే వ్యూహంతోనే ఆయన ఈ ఎదురుదాడి చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మాజీ మంత్రి అనిల్ చేస్తున్న ఆరోపణల్లో ప్రధానంగా సైదాపురం, సిద్ధివినాయక మైనింగు సైట్లను ప్రస్తావిస్తున్నారు. ఆ రెండు టీడీపీలోని కీలక నేతలకు సంబంధించినవి కావడం విశేషం. అయితే రాజకీయంగా ప్రస్తుతం బలంగా ఉన్న టీడీపీ నేతలకు చెందిన క్వారీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడమనేది ప్రశ్నార్థకమే. ఈ విషయం తెలిసినా అనిల్ కుమార్ యాదవ్ వాటిపై ఆరోపణలు చేయడం వెనుక వ్యూహం ఉందంటున్నారు. తన ఆత్మరక్షణకు టీడీపీ నేతలను టార్గెట్ చేయడం ఒక్కటే మార్గంగా అనిల్ కుమార్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. మాజీ మంత్రి కాకాణి విషయంలో పావులు కదిపినట్లు తనను టార్గెట్ చేస్తే తాను టీడీపీ నేతలను వదిలేది లేదనే సంకేతాలు పంపడానికే అనిల్ కుమార్ యాదవ్ ఎదురుదాడి వ్యూహం ఎంచుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.